21 మంది ఉపాధ్యాయులకు నోటీసులు

- ఆన్‌లైన్‌లో హాజరు నమోదు కాకపోవడమే కారణం

అనకాపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 21 మంది ఉపాధ్యాయులకు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు నోటీసులు జారీ చేశారు. వరుసగా ఐదు రోజులపాటు ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేసుకోకపోవడంతో నిబంధనల మేరకు తాఖీదులు జారీ చేసినట్టు తెలిసింది.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలనే ఉద్దేశంతో పాఠశాల విద్యాశాఖ ఆన్‌లైన్ అటెండెన్స్ (బయోమెట్రిక్ హాజరు) తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. వరుసగా ఐదు రోజులపాటు ఆన్‌లైన్ అటెండెన్స్ నమోదు చేసుకోని వివిధ మండలాలకు చెందిన 21 మంది ఉపాధ్యాయులు విధులకు హాజరుకానట్టు పరిగణించి డీఈవో నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న ఉపాధ్యాయులు.. పాఠశాలకు హాజరైనప్పటికీ ఏ కారణంతో ఆన్‌లైన్ హాజరు నమోదు చేసుకోలేకపోయారన్న దానిపై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. మారుమూల ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్స్ సరిగా లేని కారణంగా ఆన్‌లైన్‌లో అటెండెన్స్ నమోదు చేయలేకపోతున్నామని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

రిటైర్ అయిన ఉపాధ్యాయుడికి నోటీసు!

ఆన్‌లైన్ అటెండెన్స్ పక్కాగా అమలు చేయాలన్న ఉద్దేశంతో పలువురు ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారులు ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లి గవరపాలెంలో శాకంబరి అలంకరణలో దర్శనమిస్తున్న కనకదుర్గ అమ్మవారు

శాకంబరి అలంకరణలో కనకదుర్గమ్మ

ఆషాఢ మాసం బహుళ అష్టమిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో కనకదుర్గాదేవి అమ్మవార్లకు శాకంబరి అలంకరణ చేశారు. అనకాపల్లి గవరపాలెం సతకంపట్టులో, ఎలమంచిలి మండలం పేటబయ్యవరం గ్రామంలో దుర్గాదేవి అమ్మవార్లను పలు రకాల కూరగాయలు, పండ్లతో ఆకర్షణీయంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి శాకంబరి అలంకరణలో వున్న అమ్మవార్లను దర్శించుకున్నారు.

-అనకాపల్లి టౌన్/ ఎలమంచిలి, ఆంధ్రజ్యోతి



ఎలమంచిలి మండలం పేటబయ్యవరంలో దుర్గాదేవిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించిన దృశ్యం

భూ దోపిడీపై సా..గుతున్న విచారణ

ఏడు నెలలు దాటినా వెల్లడికాని నివేదిక

- వైసీపీ హయాంలో పెద్ద ఎత్తున భూ అక్రమాలు
- కశింకోట మండలం విస్సన్నపేటలో వందలాది ఎకరాల ప్రభుత్వ, డి.పట్టా భూములు ఆక్రమణ
- వెంచర్ పేరుతో ప్రకృతి విధ్వంసం
- అనకాపల్లి మండలంలో ల్యాండ్ పూలింగ్ మాటున అక్రమాలు
- రెవెన్యూ రికార్డుల్లో బినామీల పేర్లు
- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత విజిలెన్స్, సీఐడీతో విచారణకు ఆదేశం
- ఇంతవరకు బహిర్గతం కాని నివేదికలు
- ల్యాండ్ పూలింగ్ బినామీలకు రూ.6 కోట్లు పరిహారంగా చెల్లింపు
- తెరవెనుక కూటమి నేతలు చక్రం తిప్పినట్టు ఆరోపణలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు అడ్డగోలుగా సాగించిన ప్రభుత్వ భూముల దోపిడీపై కూటమి ప్రభుత్వం చేపట్టిన విచారణ నత్తనడకన సాగుతున్నది. ఏడాది దాటినప్పటికీ విచారణ నివేదికలను బహిర్గతం చేయకపోవడంతో, అక్రమార్కులపై చర్యలు చేపట్టకపోవడంపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీటిల్లో కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలోని విస్సన్నపేటలో వందలాది ఎకరాల ప్రభుత్వ, డి.పట్టా భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా భారీ లేఅవుట్ వేయడం, అనకాపల్లి మండలంలో భూ సమీకరణ మాటున అనర్హులకు కోట్లాది రూపాయలు పరిహారంగా పంపిణీ చేయడం ప్రధానంగా చెప్పుకోవాలి.



విస్సన్నపేట ప్రభుత్వ భూముల్లో ప్రకృతి విధ్వంసానికి ఇదే సాక్ష్యం (ఫైల్ ఫొటో)

వైసీపీ అధికారంలో వున్నప్పుడు జిల్లాకు చెందిన ఓ మంత్రి, ఆయన అనుచరగణం అనకాపల్లి, కశింకోట, సబ్బవరం, పరవాడ మండలాల్లో ప్రభుత్వ, డి.పట్టా భూములను చెరబట్టినట్టు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. అధికారాన్ని అడ్డంపెట్టుకుని కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలోని విస్సన్నపేటలోని సుమారు 350 ఎకరాల వివాదాస్పద డి.పట్టా భూములు, ప్రభుత్వానికి చెందిన కొండ గోర్జిలు, వాగులు, వంకలను కబ్జా చేశారు. యంత్రాలను వినియోగించి ప్రకృతి విధ్వంసానికి పాల్పడ్డారు. వీఎంఆర్‌డీఏ నుంచి అనుమతులు తీసుకోకుండా.. 'వింటేజ్ మౌంట్ వ్యాలీ రిసార్ట్' పేరుతో వెంచర్ వేసి, విల్లాలు నిర్మించనున్నట్టు ఆకర్షణీయమైన బ్రోచర్లతో ఆర్భాటంగా ప్రచారం చేశారు. వీటిపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. జిల్లాస్థాయి అధికారులు స్పందించి, మొక్కుబడిగా విచారణ జరిపించి చేతులు దులుపుకున్నారు. మరోవైపు జనసేన నేత దూలం గోపి లోకాయుక్తను ఆశ్రయించడమే కాకుండా, పార్టీ అధినేత ... మిగతా 8వ పేజీలో



కోడూరులో ల్యాండ్ పూలింగ్ వివాదంలో వున్న భూములు ఇవే

స్మార్ట్ మీటర్లపై రగడ

వైసీపీ హయాంలో వ్యవసాయ మోటార్లకు ఏర్పాటు

- ఆ తరువాత పంచాయతీలు, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలకు...
- నెలకు 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించే గృహాలకు కూడా అమర్చాలని వారం క్రితం నిర్ణయం
- ఒప్పుకోబోమని సంఘాల హెచ్చరిక
- మీటరుకు రూ.7 వేలు వసూలు చేస్తారనే అపోహలు
- రూపాయి కూడా తీసుకోబోమంటున్న అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



విద్యుత్ స్మార్ట్ మీటర్లపై ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రోజూ ఎక్కడో ఒకచోట నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. వాటిని వినియోగదారులు వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా విశాఖపట్నంలో అయితే అపార్ట్‌మెంట్ల అసోసియేషన్లు సమావేశాలు పెట్టుకొని తాము స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఒప్పుకోబోమని ప్రకటిస్తున్నాయి. దీనికి అనేక కారణాలు ఉన్నాయి.

అనకాపల్లి జిల్లాకు సంబంధించి

- అనకాపల్లి జిల్లాలో మొత్తం విద్యుత్ సర్వీసులు సుమారుగా 6 లక్షలు
- స్మార్ట్ మీటర్లు పెట్టాలని ఇచ్చిన లక్ష్యం 1,40,953 వాటిలో ఇప్పటివరకూ అమర్చినవి 44,473

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ స్మార్ట్ మీటర్ల కార్యక్రమం మొదలైంది. మొదట వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకే పరిమితం అంటూ ప్రకటించారు. వ్యవసాయ విద్యుత్‌కు రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తున్నందున ఆ వినియోగం ఎక్కడ ఎంత మేరకు ఉందో కచ్చితంగా తెలుసుకోవడానికి ఇవి ఉపయోగపడతాయంటూ పొలాల్లో మోటార్లకు అమర్చారు. ఆ తరువాత ప్రభుత్వ కార్యాలయాల నుంచి బిల్లులు సరిగ్గా వసూలు కావడం లేదని, అలాగే పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల బిల్లులు పేరుకుపోతున్నాయని, వాటి లెక్కలు తేల్చడానికి ఈ స్మార్ట్ మీటర్లు పెడతామంటూ...ఇటీవల వాటికి శ్రీకారం చుట్టారు. ఆ తరువాత కమర్షియల్, ఇండస్ట్రియల్ వినియోగదారులకు పెడతామన్నారు. ఇప్పుడు.. అంటే మూడు నెలల నుంచి ... మిగతా 8వ పేజీలో

రెవెన్యూ భూమిలోనే వాక రోడ్డు

తేల్చిచెప్పిన అధికారులు

- రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్త సర్వే
- సరిహద్దులు నిర్ధారించిన అధికారులు
- కలెక్టర్, ఆర్‌డీవోలపై ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే గణేశ్‌పై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్



రెవెన్యూ, అటవీ శాఖల సరిహద్దును గుర్తిస్తున్న జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఎస్.గోపాలరాజు. పక్కన రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు

మాకవరపాలెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం మండలం రాచపల్లి రెవెన్యూ ఎరకన్నపాలెం సర్వే నంబరు 737లో వున్నది రెవెన్యూ భూమి అని, దానిలో నుంచే వాక రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని అధికారులు ఎట్టకేలకు నిర్ధారించారు. శుక్రవారం రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఇక్కడకు వచ్చి జాయింట్ సర్వే నిర్వహించారు.

మాకవరపాలెం మండలం ఎరకన్నపాలెం నుంచి ఎలమంచిలి వద్ద జాతీయ రహదారి వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న రెండు వరుసల నూతన రహదారిపై (వాక రోడ్డు) వైసీపీ నాయకులు రాజకీయ రాద్ధాంతం చేస్తున్న విషయం తెలిసిందే. ఎరకన్నపాలెం నుంచి పెదపల్లి వద్ద హైవే వరకు చేపట్టిన మట్టి రోడ్డు పనులను నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే గణేశ్‌తోపాటు పలువురు వైసీపీ నాయకులు గురువారం పరిశీలించి, రిజర్వు ఫారెస్టు భూముల్లో నుంచి ... మిగతా 8వ పేజీలో

ఐదు దశాబ్దాల కల సాకారమవుతున్న వేళ..

- రెండు వరుసల రహదారిగా అభివృద్ధి కానున్న వాక రోడ్డు
- ఐదు మండలాల ప్రజలకు తగ్గనున్న ప్రయాణ దూరం



రెవెన్యూ భూమిలో తుప్పలు తొలగించి వాక రోడ్డును బాగుచేసుకున్న రైతులు

మాకవరపాలెం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాల నుంచి ఎదురుచూస్తున్న వాక రోడ్డు కల సాకారం కానుండడంతో ఈ ప్రాంత రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే ఐదు మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలకు రవాణా సదుపాయం మెరుగుపడుతుంది. కానీ వైసీపీ నేతలు దీనిని రాద్ధాంతం చేస్తూ అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. వాస్తవంగా వాక రోడ్డు నిర్మాణం విషయంలో స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయిన ... మిగతా 8వ పేజీలో

అచ్యుతాపురంలో ట్రాఫిక్ జామ్

అచ్యుతాపురం-గాజువాక రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు



రెండు గంటలకుపైగా స్తంభించిన వాహనాల రాకపోకలు

- వేడి, ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రయాణికులు
- ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణంతో పూడిమడక రోడ్డును మూసివేయడమే కారణం!

అచ్యుతాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించింది. గాజువాక- ఎలమంచిలి, అనకాపల్లి-పూడిమడక రహదారుల్లో సుమారు రెండు గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, సెజ్ కంపెనీల ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం జరుగుతుండడంతో అచ్యుతాపురం-పూడిమడక రోడ్డును మూసేశారు. దీంతో సెజ్‌లో కంపెనీలు, కర్మాగారాలకు రకపోకలు సాగించే వాహనాలను ఎలమంచిలి రోడ్డులో వెదురువాడ, వెంకటాపురం జంక్షన్, సెజ్ పునరావాస కాలనీ మీదుగా ... మిగతా 8వ పేజీలో



ట్రాఫిక్ జామ్‌తో వాహనాల్లో నుంచి కిందకు దిగిన ప్రయాణికులు

రెవెన్యూకు త్వరలో సొంతగూడు

రూ.1.2 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- తహసీల్దారు కార్యాలయం భవన నిర్మాణ పనులు పునఃప్రారంభం
- మూడు శాఖలకు తీరనున్న వసతి సమస్య

చోడవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం సొంత భవనం నిర్మాణానికి మార్గం సుగమమైంది. తొమ్మిది సంవత్సరాలుగా అసంపూర్తిగా వున్న ఈ భవనానికి.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కదలిక వచ్చింది. ప్రభుత్వం ఇటీవల రూ.1.2 కోట్లు మంజూరు చేయడంతో పనులు పునఃప్రారంభమయ్యాయి.

అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన చోడవరంలో తహసీల్దార్ కార్యాలయానికి పదేళ్ల నుంచి సొంతగూడు కరువైంది. సుమారు 26 ఏళ్ల క్రితం పీపుల్ వార్ గ్రూపు నక్సలైట్లు (ప్రస్తుతం సీపీఐ మావోయిస్టు పార్టీ) రెవెన్యూ కార్యాలయం భవనాన్ని బాంబులు పెట్టి పేల్చివేశారు. దీంతో భవనం తీవ్రంగా దెబ్బతిన్నది. శిథిల భవనంలోనే కార్యాలయాన్ని కొనసాగించారు. రాష్ట్ర విభజన తరువాత 2016లో టీడీపీ అధికారంలో వున్నప్పుడు తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవన నిర్మాణం కోసం రూ.50 లక్షల ఎంపీ ల్యాడ్ నిధులు కేటాయించారు. పాత భవనాన్ని కూల్చివేసి, కొత్త భవనం నిర్మించడానికి తహసీల్దారు కార్యాలయాన్ని తాత్కాలికంగా స్త్రీశక్తి భవనంలోకి ... మిగతా 8వ పేజీలో



నిర్మాణ పనులు పునఃప్రారంభమైన తహసీల్దారు కార్యాలయ భవనం

ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన అవసరం



ప్రకృతి సాగుపై అవగాహన సదస్సులో వ్యవసాయాధికారి మోహనరావు


ఎలమంచిలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంపై అంతా అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు సూచించారు. పోతిరెడ్డిపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం ఎలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలకు ప్రకృతి వ్యవసాయంపై క్షేత్రస్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల పరిధిలోని ప్రతి రైతూ ప్రకృతి సాగుపై ఆసక్తి చూపేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రకృతి సాగు ద్వారా పండించిన నవధాన్యాలను సిబ్బందికి చూపి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం దశపత్రి కషాయం తదితర వాటిని క్షేత్రస్థాయిలో తయారు చేయించి, వాటి ఉపయోగాలను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి లచ్చన్న, ఏడీఏ జాహ్నవి, ఏఓలు విజేత, మోహనరావు, సౌజన్య, సుమంత, శంకర్, గోవింద్, ఏఈవో దేముళ్లు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ఏఐసీటీఈ ఇండస్ట్రీ ఫెలోషిప్‌నకు ప్రసాద్ ఎంపిక


ధర్మిరెడ్డి ప్రసాద్

అచ్యుతాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) దేశంలో వివిధ పరిశ్రమల అనుసంధానంతో అందిస్తున్న ఇండస్ట్రీస్ ఫెలోషిప్‌నకు ఇక్కడి ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ ఎంపికయ్యారు. పూణేలో గల సి డ్యాక్ ఆధ్వర్యంలో అడ్వాన్స్ కంప్యూటింగ్‌లో ఏడాది పాటు శిక్షణ ఉంటుంది. అఖిల భారత సాంకేతిక విద్యా మం డలి వివిధ రంగాల్లో దేశవ్యాప్తంగా 140 మందికి 81 పరిశ్రమల అనుసంధానంతో ఈ ఫెలోషిప్‌నకు అవకాశం కల్పించగా అందులో ప్రసాద్ అడ్వాన్స్ కంప్యూటింగ్ విభాగానికి ఎంపిక కావడం విశేషం. వారణాశిలో ఐఐటీలో ఎం.టెక్ చదివిన ప్రసాద్ అచ్యుతాపురంలో ప్రశాంతి విద్యా సంస్థలను నెలకొల్పి ఇప్పటికే పలు పరిశోధనల ప్రాజెక్టులకు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా అతనిని పలువురు అభినందించారు.

వైసీపీ పాలనతోనే రాష్ట్రం సుభిక్షం : ధర్మశ్రీ



రాంబిల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ నూతన సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని మామిడివాడ గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఎస్ఈజెడ్ ఏర్పాటు చేసిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అన్నారు. ఈ ప్రాంతంలోని మహిళల ఆర్థిక స్వావలంబనకు బ్రాండిక్స్ ఏర్పాటుకు రెండు వేల ఎకరాల భూమిని ఎకరా రూపాయికే లీజుకు ఇచ్చి వేలాది మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. ఎస్ఈజడ్‌కు భూములు ఇచ్చి నిర్వాసితుల కుటుంబాలకు పూర్తిస్థాయిలో ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో అర్హులందరికీ పథకాలు అందించామన్నారు. కూటమి పాలనలో ఆ పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో ఆ పాలకులు విఫలమవుతున్నారని ఎద్దేవా చేశారు. అర్హులందరికీ వైసీపీ అధికారంలోకి వస్తేనే న్యాయం జరుగుతుందన్నారు.

ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య

» ఏడో వార్డులో అరకొరగా వీధి కుళాయిలు » సరిగా నీరు రాక తీవ్ర ఇబ్బందులు » అధికారులు స్పందించాలని వేడుకోలు


చేతిబోరు వద్ద నీటిని తోడుకుంటున్న మహిళ


ప్రధాన రోడ్డు అవతల నుంచి కుళాయి నీటిని తెచ్చుకుంటున్న కాలనీ మహిళలు

ఎలమంచిలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని ఏడో వార్డు పరిధి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో గల ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఏర్పడింది. కాలనీలో జనాభా అధికంగా ఉండడంతో అరకొరగా ఉన్న వీధి కుళాయిలు ఇక్కడివారి దాహార్తిని తీర్చలేకపోతున్నాయి. కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో నీరు రావడం లేదని మహిళలు వాపోతున్నారు. గతకొద్ది రోజులుగా ఈ సమస్య ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో చాలీచాలని నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెపుతున్నారు. గత్యంతరం లేక ప్రధాన రోడ్డు అవతల ఉన్న కుళాయిల వద్దకు వెళ్లి అక్కడి కుళాయిల నుంచి నీటిని తెచ్చుకుని గొంతులు తడుపుకుంటున్నామన్నారు. రోడ్డు దాటే క్రమంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నామన్నారు. మునిసిపల్ పాలకులు ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిందిగా వారంతా కోరుతున్నారు.

పట్టణంలో ఆక్రమణల తొలగింపు


ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

ఎలమంచిలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రధాన రోడ్డు పక్కన డ్రైనేజీలను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణా లను శుక్రవారం తొలగించారు. సీఐ ధనుంజయరావు, ఎస్ఐలు ఉపేంద్ర, రామకృష్ణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు సిబ్బంది బందోబస్తు మధ్య వీటిని జేసీబీతో తొలగించారు. మునిసిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వరకు ప్రధాన రోడ్డులోని దుకాణాల తొలగింపు చేపట్టారు. వ్యాపారులంతా నిబంధనలు పాటించాలని, డ్రైనేజీలు దాటి ముందుకు రావద్దని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

'అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'


పురుషోత్తపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న విజయ్‌బాబు

ఎలమంచిలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ్‌బాబు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన పురుషోత్తపురం గ్రామంలో స్థానిక నేతలతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. అర్హులంతా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ ఇన్‌చార్జ్ రాజాన వెంకునాయుడు, నాయకులు కాళ్ల వెంకట రమణ మూర్తి, రెడ్డి నానాజీ తదితరులు పాల్గొన్నారు.


ఎన్ఏఓబీ కాలనీలో వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న అజయ్

ఎన్ఏఓబీ కాలనీలో...

రాంబిల్లి : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన సాగిస్తున్నట్టు టీడీపీ రాంబిల్లి మండల తెలుగుయువత అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్ తెలిపారు. ఏడాది పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా జడ్.చింతువా పంచాయతీ శివారు ఎన్ఏఓబీ కాలనీలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఏడాదిలో కూటమి ఎన్నెన్నో విజయాలు సాధించినట్టు చెప్పారు. అనంతరం పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పప్పల గోవిందరావు, వాడ్ర వెంకటరావు, గొంతిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ అలంకరణలో దుర్గామాత


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎలమంచిలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం వేడుకల్లో భాగంగా మండలంలోని పద్మనాభరాజుపేట బయ్యవరం గ్రామంలో కొలువుదీరిన దుర్గామాత శుక్రవారం శాకంబరీ అలంకరణలో దర్శనమిచ్చారు. వేకువజామున వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారి విగ్రహాన్ని విశేషంగా అలంకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వివిధ గ్రామాల నుంచి అమ్మవారి దర్శనానికి భారీగా తరలి రావడంతో ఆలయ పరిసరాల్లో కోలాహల వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'హెరిటేజ్'పాడి రైతులకు ఏరువాక బోనస్


రైతులకు బోనస్ పంపిణీచేస్తున్న డెయిరీ మేనేజర్ శేషు

అచ్యుతాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధే తమ ధ్యేయమని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. మడుతూరులో 43 మంది పాడి రైతులకు సోమవారం ఆయన ఏరువాక బోనస్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. ఇతర డెయిరీలకన్నా అధిక ధరలకు పాలను కొనుగోలు చేస్తున్నామన్నారు. పాడి పశువులతో పాటు వాటిని పెంచే రైతులకు కూడా బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు చెప్పారు. తక్కువ ధరలకే పశువులకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎ. నాగేశ్వరరావు, శ్రీను, పి.రాంబాబు, ఎ.సాయి, కోటి, బి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైరింగ్‌లో లోపాల వల్లే అధిక బిల్లు : ఏఈ శ్రీనివాసరావు

అచ్యుతాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వైరింగ్‌తో పాటు విద్యుత్ మీటర్‌లో లోపాలు ఉన్నందువల్లే రాజాన పాలెంలో విద్యుత్ బిల్లు రూ.40,581లు వచ్చినట్టు తమ ప్రాథమిక విచారణలో తేలిందని అచ్యుతాపురం ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. 'సూర్యఘర్ లబ్ధిదారుడికి సోలార్ షాక్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆయన వెనువెంటనే స్పందించారు. సిబ్బందిలో వెళ్లి రిటైర్డ్ ఉద్యోగి రాజాన అప్పలనాయుడు గృహాన్ని పరిశీలించారు. విద్యుత్ మీటరుతో పాటు హౌస్ వైరింగ్‌లో కూడా తేడాలుండడం వల్లే అధికంగా బిల్లు వచ్చినట్లు తమ ప్రాథమిక పరిశీలనలో తేలిందన్నారు. ఇంటి పాత మీటరును తొలగదించి, దాని స్థానంలో కొత్త మీటరు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు


తంగేడు పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ తిరుమలరావు

కోటవురట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా నాలుగు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని మండల తహసీల్దార్ తిరుమలబాబు తెలిపారు. మండలంలోని పీకేపల్లి, తంగేడు, పాములవాక, రామచంద్రపురం గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు గ్రామాల్లో కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణితం ప్రతిభా పరీక్ష


గణితం టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

నక్కపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతులు చదువుకుంటున్న విద్యార్థులకు శుక్రవారం గణితంలో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. వింగ్స్ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు ఎం.ఆనంద్, సెక్రటరీ ఎం.జయప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలో 40 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హెచ్‌ఎం ఎస్.జయశ్రీ మాట్లాడుతూ విద్యార్థుల్లో వున్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పరీక్షలు ఉపయోగపడతాయని చెప్పారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు విలువైన స్టడీ మెటీరియల్‌తో పాటు పేద విద్యార్థులకు ఫీజు కూడా చెల్లిస్తామని సంస్థ ప్రతినిధులు చెప్పారు. గణితం టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులను అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఏవీఎల్ఎన్ కుమారి, ఫాల్గుణరావు, వి.పద్మావతి, నాగేశ్వరరావు, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దోమల బెడద లేకుండా ప్రత్యేక చర్యలు

» జిల్లా పంచాయతీ అధికారి సందీప్

నాతవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో దోమల బెడద లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ చెప్పారు. డి.యర్రవరం గ్రామంలో పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగును దగ్గర ఉండిమరీ తీయించారు. రహదారి పక్కన ఉన్న చెత్త కుప్పలను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటి కుళాయిలు. ట్యాంకుల దగ్గర పరిశుభ్ర వాతావరణం ఉండేలా చూడాలని సిబ్బందికి ఆదేశిం చారు. దోమల నివారణకు ఫాకింగ్ చేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.చిన్నోడు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక శ్రద్ధ చూపండి


సచివాలయ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి లవరాజు

పాయకరావుపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం అమలులో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పాయకరావుపేట పంచాయతీ కార్యదర్శి ఎంవీఎస్.లవరాజు సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. పట్టణంలో సచివాలయాలకు బదిలీపై వచ్చిన ఉద్యోగులతో శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. వివిధ పనులపై సచివాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, వారి వచ్చే అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కారం కానివి తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సచివాలయాల పరిధిలో ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది వరహాలబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.


జ్వరాల అదుపునకు ప్రత్యేక బృందాలు

» జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి

నాతవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జ్వరాల అదుపునకు ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి చెప్పారు. మండలంలోని సరుగుడు గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సరుగుడు, గుమ్మిడిగొండ, చమ్మచింత, మాధవనగరం తదితర గ్రామాల్లో వైద్య బృందాలను ఏర్పాటు చేశామని, వారు ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తిస్తారని చెప్పారు. తర్వాత వారికి అవసరమైన వైద్య సేవలు, మందులు అందిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. కాగా వైద్య శిబిరంలో 50 మందికి పరీక్షలు చేశారు. అలాగే సరుగుడులో వైద్య సిబ్బంది 400 ఇళ్లకు వెళ్లి 1500 మందికి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో డ్రోన్ల కీలక పాత్ర

» అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా


శిక్షణలో పాల్గొన్న రిజర్వు పోలీసు సిబ్బంది

విశాఖపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో డ్రోన్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు మైదానంలో 25 మంది సిబ్బందికి జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణపై మూడు రోజుల పాటు జరిగే శిక్షణ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులను మరింత సమర్థంగా నిర్వహించేందుకు డ్రోన్ టెక్నాలజీ అవసరమన్నారు. అసాంఘిక శక్తులను నియంత్రించేందుకు డ్రోన్లను విస్తృతంగా వినియోగించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ బెండి వెంకట్రావు, ఐటీ కోర్ ఎస్ఐ సురేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనే లక్ష్యంగా పనిచేయండి


సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్లాస్టిక్ నిర్మూలనే లక్ష్యంగా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్లాస్టిక్ నిషేధంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం నివారణ అధికారుల నుంచే ప్రారంభం కావాలన్నారు. తద్వారా ప్రజలకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. ఈ నెల 19వ తేదీన ప్లాస్టిక్ వాడకం నిషేధానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం ఒక ఉద్యమంలా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ రఘురామ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఏవో సరోజిని తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే గర్భిణులకు ఆరోగ్యం

నక్కపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకోవడం వల్లే గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో డి.సీతారామరాజు చెప్పారు. మండలంలోని చందనాడ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు బియ్యం, రాగిపిండి, నూనె, ఖర్జూరం, వేరుశనగ చెక్కీలు, కోడిగుడ్లు, పాలు ప్యాకెట్లను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను గర్భిణులు, బాలింతులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పారిశుధ్య పనులను ఎంపీడీవో తనిఖీ చేశారు.



'పార్టీ కోసం కష్టపడి పనిచేయాలి'

ఎస్.రాయవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించేలా ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో శుక్రవారం సాయంత్రం వైసీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశంలో జోగులు మాట్లాడారు. గతంలో జరిగిన పొరపాటు మరలా జరగదన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని జోగులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైసీపీ జిల్లా నాయకుడు కొణతాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, సర్పంచ్‌లు ధూళి శ్రీనుబాబు, మల్లె లోవరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

మునగపాక, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రైవేటు పాఠశాలలో మూడో అంతస్థు నుంచి ప్రమాదవశాత్తూ కిందపడి కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుచ్చెయ్యపేట మండలం తైపురం గ్రామానికి చెందిన నక్క భూలోక (35) మునగపాక మండలం తోటాడ గ్రామంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో పనికి వచ్చాడు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో మూడో అంతస్థులో పని చేస్తుండగా.. ప్రమాదవశాత్తూ కింద పడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు, సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి ఎరుకనాయుడుకి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఎరుకనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ఇంటి పన్నుల స్వాహా చేసిన బిల్లు కలెక్టర్లపై విచారణకు ఆదేశం

చోడవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీలో వసూలు చేసిన ఇంటి పన్నులు సుమారు రూ.17.79 లక్షలు పంచాయతీకి చెల్లించకుండా ఎగవేసిన బిల్లు కలెక్టర్లపై విచారణకు జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్ ఆదేశించారు. ఇంటి పన్నుల మొత్తాన్ని పంచాయతీకి జమచేయకుండా బిల్లు కలెక్టర్లు వారా రమణబాబు రూ.2.36 లక్షలు, మామిడి వెంకటరమణ రూ.7.88 లక్షలు, కేవీ సరోజిని రూ.7.54 లక్షలు జమ చేయకుండా సొంతానికి ఉపయోగించుకున్నారు. దీనిపై ఇటీవల ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పంచాయతీలో విచారణ నిర్వహించి సిబ్బంది నుంచి డబ్బులు రికవరీ చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయాలని నర్సీపట్నం డీఎల్‌పీవో ఎస్‌కేవీ.ప్రసాద్, ఈవోపీఆర్‌డీ అర్జునరావు, భోగాపురం పంచాయతీ కార్యదర్శి బి.సత్యనారాయణలతో కూడిన కమిటీని నియమించినట్టు జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు. వారం రోజుల్లోగా విచారణ నివేదిక అందించాలని సూచించినట్టు చెప్పారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ



గౌరీ పరమేశ్వరులకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రిలు ఆది దంపతులకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గౌరీపరమేశ్వరి అమృతవర్షిణి భక్త బృందం, మద్దాల నాగశివ ఉమామహేశ్వరి దంపతులు ఊంజల్‌సేవ జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ఆలయ కమిటీ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు ఎనిమిది అర్జీలు



అర్జీలను అందజేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లో ఉద్యోగుల సమస్యలపై గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి నుంచి ఆమెతో పాటు కలెక్టరేట్ పరిపాలనాధికారి టి.విజయ్‌కుమార్ అర్జీలను స్వీకరించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అర్జీలను ఆయా శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎనిమిది మంది ఉద్యోగులు అర్జీలు అందించినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలి'

కశింకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని ఎంపీడీవో వి.వి.రవికుమార్ అన్నారు. మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త ఊడ్చిన వెంటనే బ్లీచింగ్ చల్లాలని సూచించారు. మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసి, ఆయా ట్యాంకుల వద్ద బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా గ్రామీణులకు పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే, తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు.

మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే జీవితం నాశనం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ రాములమ్మ

కొత్తూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అంతా అవగాహన కలిగి ఉండాలని వన్‌స్టాప్ సెంటర్ ఎస్ఐ పి.రాములమ్మ సూచించారు. ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలను సేవించడం వల్ల ఆ మత్తులో నేర ప్రవృత్తికి అలవాటు పడే ప్రమాదం ఉందన్నారు. అటువంటి వారిపై పోలీసు కేసులు నమోదైతే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. శక్తి యాప్‌ను ప్రతి మహిళ తన ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. లీగల్ అడ్వయిజర్ సునీత మాట్లాడుతూ వివిధ నేరాలు, వాటికి పడే శిక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ కో-ఆర్డినేటర్ హేమావతి, లీలా తులసీ తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి చేయాలని వినతి

తుమ్మపాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : దళితుల అభ్యున్నతికి కృషి చేయాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రను దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం అనకాపల్లిలో ఆయనను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దళిత బహుజన ఆదరణ సేవా సమితి అధ్యక్షుడు కొల్లి చిన్నప్పారావు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సొంతగూడు లేని నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని, గుడిసెలలో నివసిస్తున్న వారికి పక్కా ఇళ్లను కల్పించాలని విన్నవించారు. ఏజెన్సీ ప్రాంతాలలో నివసిస్తున్న దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నా పోలీస్ శాఖ సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు కట్టమూరి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

థైలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

సబ్బవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పశువులకు సోకుతున్న థైలేరియా వ్యాధిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ వి.చిట్టినాయుడు సూచించారు. మండలంలోని అమృతపురం, బొండావానిపాలెం గ్రామాల్లో శుక్రవారం థైలేరియా వ్యాధి నివారణకు పశువులకు వేస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థైలేరియా వ్యాధిసోకిన పశువులు మరణించే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పశు సంపదను సంరక్షించేందుకు, పాడి రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు సుమారు రూ.850 విలువ చేసే టీకాను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వేస్తున్నట్టు చెప్పారు. ఆరిపాక, అంతకాపల్లి పశు వైద్యాధికారులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ అరుణ, గొటివాడ జేవీవో వెంకటరమణ, వీఏలు వెంకటరావు, అప్పలరాజు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సత్కారం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

పరవాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వాడచీపురుపల్లి హైస్కూల్‌లో పనిచేసి బదిలీపై వెళ్లిన హెచ్ఎం కనకేశ్వరరావుతో పాటు మరో పది మంది ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. పాఠశాల కమిటీ చైర్మన్ లెక్కల సన్యాసిరావు, ప్రస్తుత హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావులు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి వారు చేసిన కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్, సౌజన్య, అరుణజ్యోతి, కామేశ్వరి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

▸ అశ్రద్ధ చూపే అధికారులపై చర్యలు ▸ ఇకపై ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం నిషేధం : కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ప్రారంభమైనందున జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యాధుల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం ఎంపీడీవోలు, లైన్ విభాగాల క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు అధికంగా ప్రబలే ప్రమాదం ఉందన్నారు. గ్రామాల్లో నీరునిలిచే పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించాలన్నారు. బ్లీచింగ్ సామగ్రిని విస్తృతంగా వినియోగించి పరిశుభ్రతను మెరుగుపరచాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది సహకారంతో నిర్వహించాలన్నారు. రాపిడ్ కిట్ల ద్వారా వ్యాధుల నిర్ధారణ పరీక్షలు ముమ్మరంగా నిర్వహించి వ్యాధుల మూలాలను గుర్తించి నివారణ చర్యలు పటిష్ఠంగా అమలు చేయాలని చెప్పారు.

మునిసిపాలిటీల్లో విస్తృతంగా ఫాగింగ్

మునిసిపాలిటీల్లో యాంటీలార్వా, ఫాగింగ్ ఆపరేషన్లు విస్తృతంగా చేపట్టి కాలువలు, డ్రైన్లలో మందులను పిచికారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పల్లె, పట్టణ ప్రాంతాల్లో మురుగు నీటి నిల్వలు లేకుండా చూడాలని, అంగన్‌వాడీలు, వసతి గృహాల ప్రాంగణాల్లో దోమల పెరుగుదలకు కారణమవుతున్న గడ్డి, చెత్తను ఉపాధి హామీ పనుల్లో భాగంగా తొలగించాలని పేర్కొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటిస్తూ చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని, డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలను నివారించేందుకు నీటి పైపుల లీకేజీలను సరి చేయాలని, ప్రతి గ్రామంలో డ్రైనేజీలను పరిశీలించి ఎక్కడా నీరు నిలవకుండా బ్లీచింగ్ చేయాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ పటిష్ఠంగా నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. స్వచ్ఛత కోసం అవసరమైన క్లాప్ మిత్రులను నియమించి వారికి వేతనాలు సమయానికి చెల్లించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు రోజువారీ గ్రామాల్లో చేయాల్సిన పనులను సమర్థవంతంగా నిర్వర్తిస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉండదన్నారు. మూడవ శనివారం నిర్వహించనున్న స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్క అధికారి తప్పకుండా పాల్గొనాలని కలెక్టర్ సూచించారు.

ఇకపై జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికార సమావేశాల్లో ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్లాస్టిక్ వినియోగం నియంత్రణకు సాధ్యమైనంత వరకు పునర్వినియోగించదగిన పదార్థాలు ఉపయోగించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డీపీవో సందీప్, డీపీఆర్సీ కో-ఆర్డినేటర్, జీఎస్ డబ్ల్యూఎస్, గ్రామీణ నీటి సరఫరా, ఏపీ ఈపీడీసీఎల్, డ్వామా ఏపీడీ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కుకు వేస్తున్న రోడ్డు పనులను అడ్డుకున్న రైతులు

▸ గ్రామ సభలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్



రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటున్న రైతులు

సబ్బవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కోడూరులో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు (ఆటోనగర్)కు లంకెలపాలెం రోడ్డు నుంచి పైడివాడ అగ్రహారం, పీతపాలెం మీదుగా నిర్మిస్తున్న వంద అడుగుల రోడ్డు పనులను శుక్రవారం పలువురు రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పార్కుకు వెళ్లేందుకు పీతపాలెం మీదుగా వంద అడుగుల వెడల్పున రోడ్డు ఏర్పాటు చేసేందుకు అధికారులు 2.68 కిలోమీటర్ల డీపీఆర్ సిద్ధం చేశారన్నారు. అందుకు సుమారు 12.2 ఎకరాల భూమి అవసరం అవుతుందని గుర్తించినట్టు చెప్పారు. జిరాయితీ రైతులకు టీడీఆర్ బాండ్లు ఇస్తామని గ్రామ సభలో తెలిపారన్నారు. అయితే వారికి ఎటువంటి బాండ్లు ఇవ్వలేదని, ఆక్రమణదారులకూ ఎటువంటి పరిహారం చెల్లించలేదని వివరించారు. పైగా ఆక్రమణదారులకు పైసా చెల్లించమని అధికారులు చెపుతుండడం తగదన్నారు. ఈ క్రమంలోనే ఎక్స్‌కవేటర్‌తో జరుగుతున్న పనులను రైతులు అడ్డుకున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులు అందరికీ న్యాయం చేసిన తరువాతే పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా అనకాపల్లి

▸ ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

అనకాపల్లి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహ రహిత జిల్లాగా అనకాపల్లిని తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 81వ వార్డు బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన కమిటీ ముఖ్యపాత్ర పోషించాలన్నారు. ఇందులో భాగంగా జీవో నంబర్ 39, 1ని తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. 18ఏళ్ల లోపు పిల్లలకు వివాహాలు చేయడం నేరమన్నారు. బాలికలు చదువుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అత్యవసర సమయాల్లో ఎమర్జెన్సీ నంబరు 112, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 108, 100కి కాల్ చేసే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా కమిటీ సభ్యులు ముఖ్యపాత్ర పోషించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్.వంశీప్రియ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అప్పారావు, జి. ప్రసాద్, పి.జగన్నాథరావు, భారతి, పార్వతమ్మ, నిర్మల, త్రివేణి, పద్మావతి, దేవిక తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కశింకోట- మునగపాక ఫీడర్ పరిధిలో పలుచోట్ల వైర్లపై వేలాడుతున్న చెట్ల కొమ్మలను శనివారం తొలగించనున్న నేపథ్యంలో అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా బజాజ్ షోరూం, ఇనుపకొట్టు నాగేశ్వరరావు ఏరియా, శారదా కాలనీ, నెహ్రూచౌక్, ఎల్ఐసీ ఆఫీస్ ఏరియా, ఉమ్మలాడ రోడ్డు ఏరియా, న్యూకాలనీ, పట్టణ బాలికోన్నత పాఠశాల, సత్య థియేటర్, రావుగోపాలరావు కళాక్షేత్రం ఏరియ, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, హోండా షోరూం, పవన్ సిటీ సెంటర్, జాతీయ రహదారి, ఏఎంఏఎల్ కాలేజీజి ఏరియా, కొత్తూరు ఏరియా, పిసినికాడ గ్రామం, కశింకోట ఏజీఎల్ ఫీడర్, లక్ష్మీదేవిపేట పొలాలు, బొజ్జన్నకొండ ఏరియా, సబ్బవరం రోడ్డులలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని వివరించారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

నేడు కశింకోట మండల సర్వసభ్య సమావేశం

కశింకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు జరగనుందని ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు విధిగా హాజరు కావాల్సిందిగా కోరారు.

కాంప్లెక్స్‌లో డ్రైనేజీని పరిశీలించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనకాపల్లి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గల డ్రైనేజీని ఆర్టీసీ సివిల్ ఇంజనీరింగ్ అధికారులు, జీవీఎంసీ అధికారులు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. 'ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణ అధ్వానం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి సదరు అధికారులు స్పందించారు. వర్షాలు పడితే నీరు కాంప్లెక్స్ అంతటా చెరువును తలపించేలా చేరుతుందన్న విషయాన్ని తెలుసుకున్నారు. భవిష్యత్తులో నీరు కాంప్లెక్స్ ఆవరణలో నిల్వ లేకుండా చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో ప్రవీణ, ఏడీఎం గౌరి తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

▸ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

అనకాపల్లి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లను అంతా వ్యతిరేకించాలని వామపక్షాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఇక్కడి సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామానాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కనుసన్నల్లో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటుపరం చేయాలని చూస్తుందని ఆరోపించారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై వేసిన రూ.842 కోట్ల భారాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గతేడాది ఏప్రిల్ నుంచి యూనిట్‌కు 40 పైసలు చొప్పున వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేసిన ఇంధన సర్దుబాటు చార్జీలు రూ. 2,787 కోట్లను వినియోగదారులకు తిరిగి చెల్లించాలని కోరారు. అలాగే తప్పుడు లెక్కలు ఇచ్చి అదనపు చార్జీలు వసూలు చేసిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలన్నారు. అదానీ కంపెనీకి చెందిన స్మార్ట్ మీటర్లను ఇప్పటికే అనేక సంస్థలు, వ్యాపారుల ఇళ్లకు బిగిస్తున్నారని, వీటిని విరమించుకోవాలని కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏపీ రైతు సంఘం, ఐద్వా, మహిళా సమాఖ్య, అపార్టుమెంట్ నివాసితుల సంఘం, క్వారీ కార్మిక సంఘం, కౌలు రైతుల సంఘం ప్రతినిధులు ఆర్.శంకరరావు, కర్రి అప్పారావు, బి.పరమేశ్వరి, డీడీ వరలక్ష్మి, మాణిక్యం, గంటా శ్రీరామ్, వైఎన్ భద్రం, ఆర్. దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

▸ వ్యవసాయ శాఖ ఏడీఏ సుబ్రహ్మణ్యం



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సుబ్రహ్మణ్యం

కశింకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని వ్యవసాయ శాఖ ఏడీఏ సుబ్రహ్మణ్యం అన్నారు. లాలంకొత్తూరులో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. దీనిలో ద్రవ జీవామృతంతో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది పైరు ఏపుగా పెరుగుతుందని వివరించారు. అదే క్రమంలో చీడపీడలను తట్టుకొని వేరుశాతం మరింత అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. రైతులు అధిక దిగుబడుల సాధనకు ఎరువులు, క్రిమి సంహారక మందులు విచ్చలవిడిగా వాడుతుండడం వల్ల నేల కలుషితమవుతుందన్నారు. దీని ఫలితంగా దిగుబడులు భారీగా పడిపోతున్నాయని పేర్కొన్నారు. అలా కాకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వల్ల భూమిలో సారం పెరడంతో పాటు దిగుబడులు కూడా అదే మాదిరిగా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి స్వప్న, వ్యవసాయ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరాధ్య మైండ్ మ్యాపింగ్‌కు మంత్రి నారా లోకేశ్ ఫిదా



ఆంగ్ల వర్ణమాలను వరుస క్రమంలో గుర్తిస్తున్న ఆరాధ్య



పరవాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భరణికం పంచాయతీ బాపడుపాలెం ఎంపీపీ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఆరాధ్య మైండ్ మ్యాపింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తోంది. ఎ నుంచి జడ్ వరకు గల ఆంగ్ల అక్షరాలను కేవలం ఒక నిమిషం 25 సెకన్లలో గుర్తించి అదరహో అనిపించింది. ఇందుకు సంబంధించిన వీడియోను పాఠశాల ఉపాధ్యాయుడు కె.గంగాధర్‌రావు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్ అయింది. ఈ వీడియోను తిలకించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థిని ఆరాధ్యను ఎక్స్ వేదికగా అభినందించారు. ఆరాధ్య తన సృజనాత్మకతతో ప్రదర్శించిన మ్యాపింగ్ మైండ్ బ్లోయింగ్ అంటూ మెచ్చుకున్నారు. చిన్నారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు గంగాధర్ రావుకు అభినందనలు తెలిపారు. పిల్లల ఆసక్తికి తల్లిదండ్రులు కృషి తోడైతే ప్రభుత్వ పాఠశాలల్లో ఇటువంటి అద్భుతాలు మరెన్నో సాధించవచ్చని లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

సబ్బవరం మండలంలో భారీ వర్షం



సబ్బవరంలో రహదారిపై నిలిచి వర్షపు నీరు

సబ్బవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. గత పదిహేను రోజులుగా ఉష్ణతాపంతో అల్లాడిపోతున్న జనం సుమారు గంట పాటు పడిన వర్షానికి ఉపశమనం పొందారు. దీంతో పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. వరి నారు పోసిన వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్న రైతులు వర్షం పడడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నాట్లు వేసిన గంటి పంటకు కూడా మేలు చేస్తుందని చెబుతున్నారు. ఇప్పటికీ వరినారు పోయని రైతులు భూమి పదునుగా ఉండడంతో నారు పోసేందుకు సిద్ధ పడుతున్నారు.

'అనుమతులు లేని క్వారీ, క్రషర్లపై చర్యలు తీసుకోవాలి'

కొత్తూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సీతానగరం రెవెన్యూ పరిధిలో అక్రమంగా క్వారీ, క్రషర్‌లను నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన గురవయ్య యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీతానగరం రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబరు 193లో 2.04 సెంట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి క్రషర్ నడుపుతున్నారని ఆరోపించారు. గతంలో అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం వి.వి.ఆర్. క్రషర్ నడుపుకునేందుకు సర్వే నంబరు 194లో అనుమతులు తీసుకొని సర్వే నంబరు 193లో నిర్మాణం చేపట్టారని తెలియజేశారు. గతంలో విజిలెన్స్ ఏడీ ఇక్కడి క్రషర్, క్వారీలపై తనిఖీలు నిర్వహించి భారీగా జరిమానా విధించారని వివరించారు. అంతేగాకుండా సర్వే నంబరు 251లో క్వారీ నిర్వహణకు ఎటువంటి అనుమతులు లేవని వివరించారు. భూమి నుంచి సుమారు 80 నుంచి 90 అడుగుల లోతు వరకు రాయి తవ్వకాలు జరిపారని, ప్రస్తుతం అవి ప్రమాదకరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ గోతులను పూడ్చివేసి గ్రామస్థులకు, పశువులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

'పీఎం జన్‌మన్ ఇళ్లకు నిధులు జమ చేయాలి'



రెవెన్యూ ఉద్యోగికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

జి.మాడుగుల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పీఎం జన్‌మన్ పథకంలో ఇళ్ల నిర్మాణాలకు పెంచిన రూ. లక్ష లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మనడాల్ డిమాండ్ చేశారు. గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఉపాధి పథకం ద్వారా అందాల్సిన రూ. 39వేలు జమ చేయాలని, ఈ పథకంలో కొత్తగా దరఖాస్తులు చేసుకున్న వారికి గృహాలు మంజూరు చేయాలని కోరారు. ఈమేరకుస్థానిక తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రమిచ్చారు. ఇళ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేసినట్లు ఇటీవల ఆ శాఖ పీడీ వెల్లడించినా ఇంతవరకు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సొమ్ము జమకాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. నాగేశ్, ఎం. రంగారావు, బాలరాజు, అచ్చిబాబు పాల్గొన్నారు.

వీల్ చైర్లు వితరణ



దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేసిన సీఐ వరప్రసాద్

గూడెంకొత్తవీధి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇద్దరు దివ్యాంగులకు స్థానిక సీఐ వరప్రసాద్ వ్యక్తిగత నిధులతో వీల్ చైర్లు అందజేశారు. శుక్రవారం ఆయన జన్మదినం పురస్కరించుకుని గాలికొండ, జీకేవీధికి చెందిన ఇద్దరికి వీల్ చైర్లు అందజేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఈ వీల్ చైర్లు కొనుగోలు చేసి అందజేసినట్టు చెప్పారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి: ఏవో



రైతులతో మాట్లాడుతున్న ఏవో సునీల్‌కుమార్

పెదబయలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం- 2005పై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి జి. సునీల్‌కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం ఉద్యాన సహాయకుడు కె. జానకీరామ్ ఆధ్వర్యంలో గంపరాయిలో ఆ సచివాలయ పరిధిలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఏవో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఆర్‌టీఐ ద్వారా ప్రజలు ప్రభుత్వ సమాచారాన్ని పొందే హక్కును కలిగి ఉంటారని తెలిపారు. పౌరులు ప్రభుత్వ కార్యకలాపాలు తెలుసుకునేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందని అన్నారు. ఏ ప్రభుత్వ శాఖలో అయినా సమాచారాన్ని తెలుసుకోవచ్చని వివరించారు. సంబంధిత అధికారులు సమాచారం ఇవ్వడంలో నిరాకరిస్తే అప్పీల్ చేసుకునే హక్కు కూడా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడికి గాయాలు

అనంతగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఢీకొన్న ఘటనలో.. తండ్రి, కొడుకు తీవ్రంగా గాయపడ్డారు..స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి ..ఐదుగురు పర్యాటకులు అరకు వెళుతుండగా.. ఎదురుగా వస్తున్న మరో కారు మర్రిగుడ సమీపంలో ఢీ కొన్నాయి.. ఈ ప్రమాదంలో బెంగళూరుకు చెందిన పర్యాటకులు పి.అశోక్, పి.చీయన్ తండ్రి, కొడుకులకు గాయాలయ్యాయి. వీరిని అనంతగిరి పీహెచ్‌సీకి తరలించి, మెరుగైన వైద్యసేవలు నిమిత్తం విశాఖ తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు కావాల్సి ఉంది.

విద్యా ప్రమాణాలను మెరుగుపరచండి: జడ్పీటీసీ



పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

అనంతగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో విద్యా ప్రమాదాలు పెంపొందించాలని జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల-1 పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థినుల విద్యాసామర్థ్యాలను పరిశీలించి అసంతృప్తివ్యక్తం చేశారు. 9,10 తరగతుల విద్యార్థినులు తెలుగు, ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాలను చూసి చదవలేక పోవడాన్ని గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు ఫలితాలు దారుణంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక స్థాయి నుంచి కనీసం చదవడం, రాయడం రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఈ పాఠశాలలో ఇద్దరు పీఎస్ ఉపాధ్యాయులు, నలుగురు ఎస్‌జీటీలు, వాచ్‌మెన్, వంట కుక్ లు ఇద్దరు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం.శ్యామ్‌సుందర్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం టి. సుబ్బారావు, సీఆర్టీ ప్రసాద్, సుబ్బారావు తదదిరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు లేక చిన్నారులు చదువుకు దూరం

» గూడెంకొత్తవీధి

మండల సమావేశంలో సభ్యుల ధ్వజం



సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి

గూడెంకొత్తవీధి, జూలై 18 (ఆంధ్రజ్యోతి):మండలంలో ఉపాధ్యాయులను నియమించకపోవడంతో 22 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన నిలిచిపోయి, ఆదివాసీ విద్యార్థులు విద్యకు దూరమయ్యారని గుమ్మిరేవుల సర్పంచ్ ముర్ల కమల ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖలో జరిగిన చర్యలో భాగంగా పాఠశాల పునఃప్రారంభం నుంచి ఉపాధ్యాయులను నియమించక విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలకు వచ్చి మధ్యాహ్న భోజనం చేసి వెళ్లిపోతున్నట్టు ఆయన తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు పలు మార్లు వినతులిచ్చినా కనీసం స్పందించడంలేదని ఆరోపించారు. అలాగే, మండల విద్యాశాఖ అధికారి తనిఖీలు లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంలేదన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో తగ్గి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు లేని పాఠశాలల్లో డిప్యుటేషన్‌పై పొరుగు పాఠశాలల నుంచి నియమించామన్నారు. సోమవారం నుంచి వీరు పాఠశాలల్లో అందుబాటులో ఉంటారన్నారు. పాఠశాలలను తరచూ తనిఖీ చేస్తున్నామని, ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరైనా, సమయపాలన పాటించకున్నా చర్యలు తీసుకుంటామన్నారు. పెదవలస సర్పంచ్ వంశీకృష్ణ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరగడంలేదన్నారు. మొక్కుబడిగా చదువులు సాగుతుండడంతోనే గత ఏడాది పదోతరగతిలో 13శాతం మంది కూడా ఉత్తీర్ణులు కాలేదన్నారు. గిరిజన సంక్షేమశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే దుస్థితి నెలకొందని ఆరోపించారు. దీనికి ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి సమాధానం ఇస్తూ ఆశ్రమ పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నామని, తరచూపాఠశాలలను తనిఖీ చేస్తున్నామన్నారు. గాలికొండ సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులు పనులు చేపట్టక ముందే కాంట్రాక్టర్లకు నిధులు చెల్లిస్తున్నారన్నారు. యర్రగెడ్డ రహదారి నిధులు చెల్లింపులు చేపట్టినా పనులు పూర్తి కాలేదన్నారు. దీనిపై డీఈఈ రఘునాథరావు నాయుడు మాట్లాడుతూ ఈ రోడ్డుకు ఇంకా నిధులు చెల్లించడంలేదని, ఈ రహదారి నెల రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు మాట్లాడుతూ. కుందలరాయిగొంది, కొత్తవీధితో పాటూ 25గ్రామాల ఆదివాసీలకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేయలేదని, ఫలితంగా ప్రభుత్వ పథకాలు అందడలేదన్నారు. దీనిపై తహసీల్దార్ అన్నాజీరావు మాట్లాడుతూ అర్హులను పరిశీలించి పట్టాలు జారీకిచర్యలు తీసుకుంటామన్నారు.ఎంపీ పీ మాట్లాడుతూ అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు దేముడు, సప్పగెడ్డ ఆనంద్, ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం : ఎస్పీ



పాలిటెక్నిక్ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్దార్

పాడేరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్పీ అమిత్‌బర్దార్ హితవు పలికారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్తే జీవితాలు నాశనమవుతాయన్నారు. తమ తల్లిదండ్రుల ఆశల మేరకు పట్టుదలగా చదువుకోవాలని సూచించారు. ఎవరైనా వత్తుపదార్థాలకు అలవాటు పడితే, వారికి వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.ధీరజ్, సీఐ దీనబందు, ఎస్ఐ ఎల్.సురేశ్, కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.హరిబాబు, ఇనస్ట్రక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

పాడేరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులనుఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 35 ఏళ్ల వయస్సుతో పాటు బీఎస్‌సీ నర్సింగ్ పూర్తి చేసి రెండేళ్ళ, జీఎన్‌ఎం నర్సింగ్ చేసిన అభ్యర్థులకు మూడేళ్ల క్లినిక్‌గా అనుభవం ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు విశాఖపట్నంలో 8 నుంచి 10 నెలలు శిక్షణ అందించి జర్మన్ భాషను సైతం నేర్పిస్తారన్నారు. అనంతరం ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించి జర్మనీ పంపిస్తారన్నారు. అక్కడ ఉద్యోగంలో చేరిన అభ్యర్థులకు భారత కరెన్సీలో సుమారు రూ.2 లక్షల వరకు నెల జీతం పొందుతారని ఆయన పేర్కొన్నారు.గిరిజన మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు వివరాలకు పాడేరులోని గిరిజన సంక్షేమ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో సంప్రదిం చాలన్నారు.

టీడీపీ లింగేటి గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



నూతన కమిటీ సభ్యులతో పరిశీలకురాలు నళిని

పెదబయలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగేటి పంచాయతీలో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైనట్టు సంస్థగత ఎన్నికల పరిశీలకురాలు నళిని తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షురాలు సీకరి సుకుమారి అధ్యక్షతన ఎన్నిక జరిగింది. టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా కొర్ర శేషగిరిబాబు, ఉపాధ్యక్షుడిగా వీర్రాజు, ప్రధాన కార్యదర్శిగా పి. సత్తిబాబును పంచాయతీ పరిధిలోని కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతాని కి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆమె కార్యవర్గానికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు కొండయయ్య, త్రినాద్, భూషణం, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

సీలేరు నుంచి విజయవాడ వెళ్లే ప్రయాణికులకు రిజర్వేషన్ సౌకర్యం

సీలేరు, జూలై 18 , (ఆంధ్రజ్యోతి) : సీలేరు నుంచి విజయవాడ వెళ్లే ప్రయాణికులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్టు విజయవాడ డిపోకు చెందిన పీటీడీ అధికా రులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ డిపోకు చెందిన 3935 నంబర్ గల సర్వీస్ రోజూ విజయవాడలో రాత్రి 9.45 నిమిషాలకు బయలుదేరి మరునటి రోజు ఉదయం ఏడున్నరకు సీలేరు చేరుతుంది. ఇదే సర్వీసు మళ్లీ ఉదయం 8.45కు సీలేరులో బయలు దేరి సాయంత్రం ఆరున్నరకు విజయవాడకు చేరుతుంది. విజయవాడ నుంచి సీలేరు వచ్చే వారి ప్రయాణికులకు మాత్రమే రిజర్వేషన్ సౌకర్యం ఉండేది. సీలేరు నుంచి విజయవాడకు రిజర్వేషన్ సౌకర్యం లేదు. ఈ స్థితిలో ఈ ప్రాంతవాసుల విజ్ఞప్తి మేరకు ఎట్టకేలకు శనివారం నుంచి సీలేరులో ఏటీబీ ఏజెంట్ వద్ద నుంచి రిజర్వేషన్ కల్పించారు.

'మాజీ ఎమ్మెల్యే ఎంవీవీ సేవలు అమూల్యం'



కొయ్యూరులోఎంవీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కొయ్యూరు జూలై 18 (ఆంధ్రజ్యోతి): దివంగత చింతపల్లి మాజీ ఎమ్మెల్యే ఎంవీవీ సత్యనారాయణ నియోజకవర్గ ప్రజల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న గొప్ప నాయకుడు అని తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నేతలు పేర్కొన్నారు. ఎంవీవీ సత్యనారాయణ 18వ వర్ధంతిని శుక్రవారం కొయ్యూరులో ఆయన స్వగృహంలో కుటుంబీకుల సమక్షంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా నేతలు ఎంవీవీ పార్టీకి చేసిన సేవలు, రెండు దఫాలు ఎమ్మెల్యేగా నియోజకవర్గాల అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. ఈ సందర్భంగా ఎంవీవీ తనయుడు ప్రసాద్ మాట్లాడుతూ తన తండ్రి ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు.అనంతరం కుటుంబీకులు సమకూర్చిన వస్త్రాలను సుమారు 100 మంది పేదలకు పలువురు నేతల చేతుల మీదుగా అందించారు.ఈ కార్యక్రమంలో మోటారు వర్కర్స్ యూనియన్ నేతలు, అల్లూరి యూత్ సభ్యులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు మరువలేం

చింతపల్లి: దివంగత మాజీ ఎమ్మెల్యే ఎంవీవీ సత్యనారాయణ సేవలు మరువలేమని టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు బేరా సత్యనారాయణ పడాల్ అన్నారు. శుక్రవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని నాయకులు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తాజంగి, లంబసింగి పీహెచ్‌సీల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. నాయకులు కిముడు లక్ష్మయ్య, మహేంద్ర, రామ్మూర్తి పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: దివంగత మాజీ ఎమ్మెల్యే ఎంవీవీ సత్యనారాయణ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక నాయకులు, కార్యకర్తలు వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, నాయకులుపసుపులేటి నాగమణి, ముక్కలి రమేశ్, మహేశ్, కల్యాణి, బుజ్జిబాబు, గాబ్రియల్ పాల్గొన్నారు

చినకోనెల, బూరుగుల్లో నేరుగా రేషన్ పంపిణీ



చినకోనేలలో రేషన్ పంపిణీ చేస్తున్న జీసీసీ సిబ్బంది

అనంతగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లి పం చాయతీ బూరుగ, చినకోనెల గ్రామాల గిరిజనులకు శుక్రవారం రొంపల్లి డీఆర్ డిపో సెల్స్‌మెన్ సీతమ్మ వాహనం ద్వారా రేషన్ సరకులను పంపిణీ చేశారు. ఈ గ్రామాల్లో గిరిజనులు రేషన్ సరకులు కోసం రొంపల్లికి 16 కిలో మీటర్ల ప్రయాణం సాగించాల్సి వచ్చేది. దీంతో గిరిజనులు ఆందోళన చేపట్టారు. దీనిపై ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావుకు స్పందించి, విజయవాడ సివిల్‌సప్లై అధికారులకు లేఖ రాశారు. ఆ అధికారులు స్పందించి గ్రామాన్ని సందర్శించారు. వారి ఆదేశాల మేరకు.. ప్రత్యేక వాహనం ద్వారా రేషన్ సరకులను పంపిణీ చేస్తున్నారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ గిరిజనులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం



కొత్తపాలెంలో బదిలీపై వెళ్లిన సచివాలయం ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

చింతపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం-1,2 గ్రామ సచివాలయాల నుంచి బదిలీపై వెళ్లి ఉద్యోగులకు పంచాయతీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. రెండు సచివాలయాల నుంచి 12మంది ఉద్యోగులు పొరుగు మండలాలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం సత్కరించిన వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనగల సోమరత్నం, వైస్‌ఎంపీపీ శారద, ఎంపీటీసీ సభ్యురాలు రాజులమ్మ, గ్రామపెద్ద బెన్నిబాబు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు:కరిముఖిపుట్టుసచివాలయంలోబదిలీపై వెళుతున్న ఏడుగురు ఉద్యోగులకు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరిముఖిపుట్టు సర్పంచ్ పూలమొత్తీ, జర్రెల సర్పంచ్ బి.భాగ్యవతి, ఈవోపీఆర్‌డీవో చిన్నాన్న, కార్యదర్శి మహేంద్ర, నేతలు అరుణ్, సురేశ్, రాంప్రసాదు, ప్రసాదు, గణేష్, చిరంజీవి, జోగారావు, వసంతరావు, పరశురాం, జిన్ను తదితరులు పాల్గొన్నారు.

'తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలి'



బొంగరం జీపీఎస్ పాఠశాల ఎదుట నిరసన చేపడుతున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు

పెదబయలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించకపోవడంతో గ్రామాల్లో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని మండలంలోని బొంగరం పంచాయతీ సర్పంచ్ లక్ష్మీపతి, ఎంపీటీసీ సభ్యుడు మత్స్యకొండబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలో ట్రైబుల్ వెల్ఫర్ యాజమాన్యానికి చెందిన బొంగరం, కుంబుర్ల, వంచుర్బ, నిట్టాపుట్టుల్లో పాఠశాలలు, మండల పరిషత్‌కు చెందిన మొట్టలగుమ్మి ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరన్నారు. దీంతో వేసవి సెలవుల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమైనా తమ పంచాయతీలోని ఐదు పాఠశాలలు మాత్రం నేటికి తెరుచుకోలేదని వాపోతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులవుతున్నా ఉపాధ్యా యులు రాకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. ప్రస్తుతం పాఠశాల భవనాలు మందుబాబులకు అడ్డాగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యాశాఖ అధికారులకు పలుమార్లు విన్న వించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులను నియమించి చిన్నారులకు విద్యను చేరువ చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గిరిజన రైతుల ప్రగతికి కృషి చేస్తా

» చింతపల్లి ఏఎంసీ నూతన చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళ



టీడీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళ

చింతపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత రైతుల ప్రగతికి తన వంతు కృషి చేస్తానని స్థానిక ఏఎంసీ చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళ అన్నారు. ప్రభుత్వం ఏఎంసీ చైర్మన్‌గా ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం ఆమె ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. తన లాంటి సామాన్య కార్యకర్తకు ఏఎంసీ పదవి కేటాయించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు. ప్రతి ఒకరికి సమాన ప్రాధాన్యం ఇస్తానన్నారు. తనకు ఏఎంసీ చైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, లక్ష్మణ్, కేశ్వరరావు, చైతన్య, అబ్బాయిదొర, మహేంద్ర, జశ్వంత్ పాల్గొన్నారు.

మోస పూరిత నాయకుల మాటలు నమ్మొద్దు

» జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్



:కోసంగి పనసపుట్టు గ్రామ గిరిజనులతో మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్

దుంబ్రిగుడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని, ఎట్టిపరిస్థితుల్లో మోసపూరిత నేతలు మాటలను నమ్మొద్దని జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్ అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కోసంగి పనసపుట్టు గ్రామాన్ని శ్రావణ్ కుమార్ సందర్శించారు. గిరిజనులతో మమేకమయ్యారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిపై కరపత్రాలతో ప్రచారం చేశారు. అనంతరం గ్రామంలో సమస్యల అడిగి తెలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయలేదని, ప్రస్తుతం ఆ పార్టీ నేతల మాటల్లో పడొద్దన్నారు. గ్రామంలో డ్రైనేజీ, వీధుల్లో రోడ్డు పనులపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామనిశ్రావణ్‌కుమార్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మహిళలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుబ్బారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మట్టం భీమరాజు, భాస్కరరావు, దన్నేరావు, త్రినాధ్, చినగెన్ను, బోంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయి సాగునీటి లక్ష్యంతో చెక్ డ్యామ్‌ల నిర్మాణం



రాళ్లగెడ్డ వద్ద చెడ్ డ్యామ్ నిర్మాణం పరిశీలిస్తున్న డీఈఈ జనార్దన్

గూడెంకొత్తవీధి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క రైతు పొలానికి సాగునీరందించాలనే లక్ష్యంతో చెక్ డ్యామ్‌లు నిర్మిస్తున్నట్టు పాడేరు ఎస్ఎంఐ డీఈఈ జనార్దన్ తెలిపారు. శుక్రవారం మండలంలో నిర్మాణంలో నున్న బొడ్డుమానుపరిది, నిట్టమామిడిపాలెం, రాళ్లగెడ్డ, కొత్తగూడెం, పెదవలస, అసరాడ చెక్ డ్యామ్‌లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులకు సాగు నీరు పూర్తి స్థాయిలో అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు విడుదల చేసిందన్నారు. వీటితో చెక్ డ్యామ్‌ల నిర్మాణాలు, మరమ్మతులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ నాగరాణి పాల్గొన్నారు.

33 కేవీ విద్యుత్ సరఫరాకు చర్యలు



పెదబయలు సబ్‌స్టేషన్‌లో ఎల్‌పీ బ్రేకర్ల మార్పు పనుల్లో ఈఈ వేణుగోపాల్, సిబ్బంది

పెదబయలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక 33 కేవీ సబ్ స్టేషన్‌లో శుక్రవారం నూతన బ్రేకర్లను అమార్చినట్టు పాడేరు విద్యుత్ శాఖ ఈఈ పి. వేణుగోపాల్ తెలిపారు. గతంలో 11 కేవీ ఫీడర్లు ఉండటంతో 33 కేవీ ద్వారా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగేందని, ప్రస్తుతం కొత్త ఎల్‌వీ బ్రేకర్లతో ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ఇకపై గతంలో మాదిరిగా విద్యుత్ సరఫరాకు అంతరాయం అధికంగా ఉండదని స్పష్టం చేశారు. డీఈఈ ఆనంద్‌మురళీ, ఏఈ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి: డీపీవో



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీవో చంద్రశేఖర్

ముంచంగిపుట్టు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని బాబుసాల పంచాయతీ కేంద్రాన్ని శుక్రవారం ఆయ న సందర్శించారు. వీధులను పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, ఇళ్ల పన్ను వసూళ్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఈవోపీఆర్‌డీవో చిన్నాన్న పాల్గొన్నారు.

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. ఈనెల 23తేదీ వరకు పాడేరు, చింతపల్లి, అరకు, రంపచోడవరం డివిజన్ పరిధిలో కనిష్ఠంగా 20మిల్లీ మీటర్ల నుంచి గరిష్ఠంగా 30మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

అనంతగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ బాలికల-1 పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం మంగమ్మ ఆధ్వర్యంలోబదిలీపైవెళ్లిన ఉపాధ్యాయినిలు దినాక్షీ, రంభ మణి, రాజ్యలక్ష్మి (మెట్రీ న్)లను సత్కరించారు. పాఠశాలలో వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరీగా ముత్యాలమ్మ



చింతపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు శాకంబరీగా దర్శనమిచ్చారు. ఆషాఢంలో ఆఖరి శుక్రవారం కావడంతో భక్తులు అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి సారెను తీసుకువచ్చి సమర్పించారు. సాయంత్రం వరకు ఆలయంలో భక్తిగీతా ఆలాపన జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, నిర్వాహకులు తాడి రమణ, జియోరాము, కోడి వెంకటేశ్, దాసరి సాయి, గాజుల శ్రీను, భక్తులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజు, తదితరులు

చోడవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంకుపాలెం రహదారిలో ఆటో స్టాండ్ నిర్మాణానికి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఔట్‌గేట్ ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్ స్థలంలో అన్న క్యాంటీన్ నిర్మించడంతో ఆటో స్టాండ్‌కు వసతి సమస్య ఎదురైంది. దీంతో ప్రత్యామ్నాయంగా ఆటో డ్రైవర్లకు అంకుపాలెం రహదారిలోస్థలం ఎంపిక చేశారు. ఈ స్థలంలో ఆటో స్టాండ్ ఏర్పాటుకు అవసరమైన పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గూనూరు మల్లునాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల అదుపునకు ప్రత్యేక బృందాలు



శిబిరంలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

నాతవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరుగుడు, గుమ్మిడిగొండ, చమ్మచింత, మాధవనగరం తదితర గ్రామాల్లో జ్వరాల అదుపునకు ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి చెప్పారు. సరుగుడు గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధ పడుతున్న వారిని గుర్తిస్తారని చెప్పారు. తర్వాత వారికి అవసరమైన వైద్య సేవలు, మందులు అందిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. కాగా వైద్య శిబిరంలో 50 మందికి పరీక్షలు చేశారు. అలాగే సరుగుడులో వైద్య సిబ్బంది 400 ఇళ్లకు వెళ్లి 1500 మందికి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో టిడ్కో గృహాలు నిర్మించండి

▸▸ టిడ్కో చైర్మన్‌కు జనసేన ఇన్‌చార్జి రాజు వినతి



టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్‌తో రాజు

చోడవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో ఇళ్లు లేని పేదల కోసం టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు టిడ్కో చైర్మన్ వి.విజయ్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా విశాఖ వచ్చిన ఆయన్ను శుక్రవారం కలిసి, నియోజకవర్గ కేంద్రంలో చాలామంది పేదలు అద్దె ఇళ్లలో ఉంటూ అవస్థలు పడుతున్నారని వివరించారు. దీనికి టిడ్కో చైర్మన్ సానుకూలంగా స్పందించారని రాజు తెలిపారు. కాగా, చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని జనసేనకు కేటాయించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కార్యకర్తల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా కేసులు పెట్టింది'



హోంమంత్రి అనితకు సమస్యలు వివరిస్తున్న ఎంపీటీసీ రామకృష్ణ

రోలుగుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం కక్షకట్టి టీడీపీ కార్యకర్తలపై అన్యాయంగా కేసులు నమోదు చేయించిందని రోలుగుంట ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హోం మంత్రి అనితను ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలు తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను కొట్టివేయాలని, బీఎన్ రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



మాధవ్‌కు జ్ఞాపిక అందిస్తున్న నాయకులు

నర్సీపట్నం అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను నియోజకవర్గ నాయకులు అడిగర్ల సతీశ్, కాళ్ల సుబ్బారావు, బోళెం శివ, పల్లా గోవింద శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మాధవ్‌ను దుశ్శాలువతో సత్కరించారు. నియోజవర్గంలో పార్టీ విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాలను మాధవ్‌కు వివరించారు.

పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశాలు

▸▸ సెజ్ ప్రజాభిప్రాయ సేకరణ సభలో తహశీల్దార్ లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ లక్ష్మి

బుచ్చెయ్యపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తహశీల్దార్ ఎం.లక్ష్మి చెప్పారు. మండలంలోని ఆర్.భీమవరం గ్రామంలో శుక్రవారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశ్రమల కోసం భూసేకరణకు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని, అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చని చెప్పారు. పరిశ్రమలు వస్తే ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. పలువురు రైతులు మాట్లాడుతూ అన్ని భూములకు సమానంగా నష్ట పరిహారం అందచేయాలని, సాగులో ఉండి రికార్డులు లేని భూములకు కూడా న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, నాయకులు బల్లిన అమ్మునాయుడు, మలిరెడ్డి బుజ్జి, కంచిపాటి శ్రీను, శానాపతి నాయుడు, వి.అప్పలనాయుడు, కవల సతీశ్, నమ్మి అప్పలరాజు, గొల్లవిల్లి సత్యనారాయణ, పల్లెల ఈశ్వరరావు, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆరాధ్య మైండ్ మ్యాపింగ్‌కు మంత్రి లోకేశ్ ఫిదా



ఆంగ్ల వర్ణమాలను వరుస క్రమంలో గుర్తిస్తున్న ఆరాధ్య

పరవాడ, జూలై 18 (ఆంధ్ర జ్యోతి): భరణికం పంచాయతీ బాపడుపాలెం పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఆరాధ్య మైండ్ మ్యాపింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తోంది. ఎ నుంచి జడ్ వరకు గల ఆంగ్ల అక్షరాలను ఒక నిమిషం 25 సెకన్లలో గుర్తించి అదరహో అనిపించింది. ఇందుకు సంబంధించిన వీడియోను ఉపాధ్యాయుడు కె.గంగాధర్‌రావు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్ అయింది. ఈ వీడియోను తిలకించిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థిని ఆరాధ్యను ఎక్స్ వేదికగా అభినందించారు. ఆరాధ్య తన సృజనాత్మకతతో ప్రదర్శించిన మ్యాపింగ్ మైండ్ బ్లోయింగ్ అంటూ మెచ్చుకున్నారు. చిన్నారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు గంగాధర్‌రావుకు అభినందనలు తెలిపారు. పిల్లల ఆసక్తికి తల్లిదండ్రులు కృషి తోడైతే ప్రభుత్వ పాఠశాలల్లో ఇటువంటి అద్భుతాలు మరెన్నో సాధించవచ్చని లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

వితంతువులందరికీ పింఛన్లు మంజూరు

మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

చీడికాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వితంతువులందరికీ త్వరలో పింఛన్లు మంజూరు చేస్తామని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హామీ ఇచ్చారు. మండలంలోని శిరిజాం పాల కేంద్రంలో గ్రామస్థులు, టీడీపీ కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ముందుంటుందన్నారు. ఇప్పటికే పింఛన్‌ల పెంపు, తల్లికి వందనం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు తదితర పథకాలను అందజేస్తున్నామన్నారు. అనంతరం ఎల్ఎన్.పురం గ్రామంలో జరిగిన స్వాతిమేక్స్ 30వ మహాజన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, పొదుపు చేస్తున్న మహిళలు అప్పులు తీసుకున్నపుడు వాటాలుగా పంచుకోవడం కన్నా ఏదైనా పరిశ్రమను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్వాతిమేక్స్ ద్వారా నడుస్తున్న పవర్‌లూమ్ పరిశ్రమకు తనవంతు సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు.

అన్ని సమస్యలు పరిష్కరిస్తాం

అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శిరిజాం గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతల చిన్నంనాయుడు, పంచాడ దాలెంనాయుడు, మాజీ ఎంపీపీ పాత్రిని సింహాచలంనాయుడు, మేక్స్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పోతల రమణమ్మ, సిరికి రాము, మేనేజర్ ఎస్.దేముడమ్మ, నాయకులు పోతల చిన్నంనాయుడు, గండి లక్ష్మి, రెడ్డి సన్యాసినాయుడు, బీశ్ల కోటేశ్వరరావు, గండి ముసలినాయుడు, కన్నూరు శ్రీరామ్మూర్తి, దేముడునాయుడు, పైల ముత్యాలనాయుడు, కె.శ్రీనివాస్, కేవీ రమణ, షేక్ వహీద పాల్గొన్నారు.

ఎల్.సింగవరం, వడ్డాదిలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని ఎల్.సింగవరం గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తమరాన దాసు, దొండా గిరిబాబు, ఎస్.శ్రీరామమూర్తి పాల్గొన్నారు. అలాగే వడ్డాదిలో నిర్వహించిన కార్యక్రమములో దొండా నరేశ్, తలారి శంకర్, ఎస్.సత్యనారాయణ, ఎస్.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల స్వాహా చేసిన బిల్లు కలెక్టర్లపై విచారణకు ఆదేశం

చోడవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీలో వసూలు చేసిన ఇంటి పన్నులు సుమారు రూ.17.79 లక్షలు పంచాయతీకి చెల్లించకుండా ఎగవేసిన బిల్లు కలెక్టర్లపై విచారణకు జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్ ఆదేశించారు. ఇంటి పన్నుల మొత్తాన్ని పంచాయతీకి జమచేయకుండా బిల్లు కలెక్టర్లు వారా రమణబాబు రూ.2.36 లక్షలు, మామిడి వెంకటరమణ రూ.7.88 లక్షలు, కేవీ సరోజిని రూ.7.54 లక్షలు జమ చేయకుండా సొంతానికి ఉపయోగించుకున్నారు. దీనిపై ఇటీవల ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పంచాయతీలో విచారణ నిర్వహించి సిబ్బంది నుంచి డబ్బులు రికవరీ చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయాలని నర్సీపట్నం డీఎల్‌పీవో ఎస్‌కేవీ.ప్రసాద్, ఈవోపీఆర్‌డీ అర్జునరావు, భోగాపురం పంచాయతీ కార్యదర్శి బి.సత్యనారాయణలతో కూడిన కమిటీని నియమించినట్టు జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు. వారం రోజుల్లోగా విచారణ నివేదిక అందించాలని సూచించినట్టు చెప్పారు.

దోమల బెడద లేకుండా ప్రత్యేక చర్యలు

▸▸ జిల్లా పంచాయతీ అధికారి సందీప్

నాతవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో దోమల బెడద లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ చెప్పారు. డి.యర్రవరం గ్రామంలో పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగును దగ్గర ఉండిమరీ తీయించారు. రహదారి పక్కన ఉన్న చెత్త కుప్పలను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటి కుళాయిలు, ట్యాంకుల దగ్గర పరిశుభ్ర వాతావరణం ఉండేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. దోమల నివారణకు ఫాకింగ్ చేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.చిన్నోడు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయ సముదాయంపై సదస్సు

నర్సీపట్నం అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సమీకృత వ్యవసాయ సముదాయంపై శుక్రవారం రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో వెలుగు డీపీఎం కె.సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి పథకం, ఉద్యావన, వెలుగు ఆధ్వర్యంలో అమలవుతున్న సమీకృత వ్యవసాయ సముదాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సులో రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం అనురాధ, నాలుగు మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదలడంపై వివాదం

గొలుగొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్‌లో స్వదేశీ మత్యకార సొసైటీ మాజీ చైర్మన్ పి.శ్రీను, మరి కొంత మంది సభ్యులు చేపపిల్లలు వదలడంపై పోలీసులు అడ్డుకున్నారు. శుక్రవారం చేప పిల్లలు వదులుతున్నట్టు సొసైటీ చైర్మన్ నక్కా రమణకు సమాచారం అందింది. దీంతో సొసైటీ నిబంధనలకు విరుద్ధంగా శ్రీను చేప పిల్లలు రిజర్వాయర్‌లో వదులుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ రామారావు రిజర్వాయర్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరు వర్గాలకు వివాదం జరగకుండా, రిజర్వాయర్‌లో చేపపిల్లలు వదలకుండా వెనక్కి పంపించారు. కార్యక్రమంలో మత్యకార సభ్యులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో అధిక ఆదాయం

చీడికాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగుతో రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం సమకూరుతుందని జిల్లా ఉద్యానవన శాఖాధికారి రహీమ్ చెప్పారు. బైలపూడి గ్రామంలో రైతు జాజిమొగ్గల ఈశ్వరరావు పొలంలో పామాయిల్ మొక్కలను శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులు నాటించారు. ఈ సందర్భంగా 258 మొక్కలు ఉచితంగా అందించారు. అనంతరం రహీమ్ మాట్లాడుతూ పామాయిల్ సాగుచేసే రైతులకు ఒక హెక్టారులో ఎరువులకు రూ.5250, అంతర పంటల సాగుకు రూ.5230 చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తామన్నారు. అలాగే డ్రిప్ ఇరిగేషన్‌కు రూ.10 వేలు చెల్లిస్తే 90 శాతం రాయితీ అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ నవీన్, క్లస్టర్ ఆఫీసర్ అప్పలనాయుడు, ఉద్యానవన అధికారి కిరణ్మయి, యువజన నాయకుడు గొల్లవిల్లి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులకు భూమి పూజ



రొంగలినాయుడుపాలెంలో భూమి పూజ చేస్తున్న దృశ్యం

కె.కోటపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వారాడ నారాయణమూర్తి రైవాడ రిజర్వాయర్ పరిధిలోని రొంగలినాయుడుపాలెం గ్రామంలో సాగునీటి కాలువల్లో పూడికతీత పనులకు రిజర్వాయర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పోతల పాత్రునినాయుడు శుక్రవారం భూమి పూజ చేశారు. నారాయణపాత్రుని చెరువు, శంభునాయుడు చెరువులకు సంబంధించిన సుమారు రూ.8 లక్షల అంచనా వ్యయంతో పూడికతీత పనులు జరగనున్నాయి. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ జి.సత్యంనాయుడు, అసిస్టెంట్ ఇంజినీర్ నందకిశోర్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.మహేశ్, పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి జె.రాము, రొంగలినాయుడుపాలెం బ్రాంచ్ చానెల్ సాగునీటి సం ఘం చైర్మన్ స్వామినాథం, నాయకులు నారాయణమూర్తి, అప్పలనాయుడు, నరసింహనాయుడు, కె.నారాయణరావు, రాఘవనాయుడు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలు తొలగించాలని ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నర్సీపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బెల్టు దుకాణాలను వెంటనే తొలగించాలని కల్లుగీత కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏపీ కల్లుగీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిన నాగేశ్వరరావు మాట్లాడుతూ బెల్టు షాపులు తొలగించి కల్లు గీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా మూడు వేల బెల్టు షాపులు నడుపుతున్నారని ఆరోపించారు. బెల్టు షాపులు తొలగించడానికి అధికారులతో ప్రత్యేక గ్రామ కమిటీలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి యర్రా దేముడు, ఉపాధ్యక్షుడు రాము తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

గొలుగొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ పంచాయతీ పరిధిలోని పేటమాలపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఈ కార్యక్రమం చేపట్టారు. పది రోజులుగా తాగునీరు అందకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి పైపులైన్ వాల్వ్ మరమ్మతులకు గురవడంతో ఈ సమస్య ఏర్పడిందని, త్వరితగతిన మరమ్మతు చేపట్టి తాగునీరు అందించాలని వారు కోరారు. అనంతరం ఎంపీడీవో మేరీరోజీకి వినతిపత్రం అందించారు.

రేషన్ పంపిణీకి సబ్ పాయింట్ ఏర్పాటుచేయాలి



రేషన్ బియ్యం మూటలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రావికమతం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చీమలపాడు పంచాయతీలోని శివారు గ్రామాలకు రేషన్ పంపిణీ కోసం జెడ్.జోగుంపేటలో సబ్ పాయింట్ ఏర్పాటు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం శివారు గ్రామాల గిరిజనులు బియ్యం మూటలతో వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రస్తుతం కల్యాణపులోవలోని జీసీసీ డిపో ద్వారా రేషన్ తీసుకుంటున్నామని, 13 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని అజయ్‌పురం, పెదగరువు, రాయిపాడు, రొచ్చుపణుకు, తాటిపర్తి, గంగంపేట, నేరేడుబంద తదితర గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్.జోగుంపేటలో సబ్ పాయింట్ ఏర్పాటు చేస్తే మూడు కిలోమీటర్ల దూరమే ఉంటుందని, దీనిపై అధికారులు తక్షణమే స్పందించాలని వారు కోరారు.

ఉపాధ్యాయుడ్ని బదిలీ చేయాలని ఆందోళన



పాఠశాల వద్ద నినాదాలు చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

రోలుగుంట, జూలై 18(ఆంధ్రజ్యోతి): పిల్లలకు చెక్కీలు, గుడ్లు సక్రమంగా ఇవ్వక పోవడంతో పాటు తల్లిదండ్రులపై అసభ్యకరంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడు బోనెల రాముపై చర్యలు తీసుకుని వేరే పాఠశాలకు బదిలీ చేయాలని కోరుతూ శుక్రవారం అర్ల ఎంపీపీ పాఠశాల ఎదుట పిల్లలతో కలిసి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు విధులను సక్రమంగా నిర్వహించడం లేదని, పిత్రిగెడ్డ, నీలిబంధ పీవీటీజీ పిల్లలకు కూడా చెక్కీలు, గుడ్లు ఇవ్వడం లేదని, అడిగితే రోలుగుంట పోలీసు స్టేషన్‌లో తమపైనే అన్యాయంగా కేసులు పెట్టి బెదిరిస్తున్నారని ఆరోపించారు. అలాంటి ఉపాధ్యాయుడు తమకు వద్దని నినాదాలు చేశారు. అలాగే పాఠశాలలో చెట్లు వేలం ద్వారా వచ్చిన సొమ్ము పాఠశాల ఖాతాకు జమచేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ పాడి లక్ష్మి, వైస్ చైర్మన్ పాడి శ్రీను, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వంద మందికి వైద్య సేవలు

కృష్ణాదేవిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురం గొల్లవీధిలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు వంద మందికి వైద్యాధికారిణి ఎస్.గాయత్రి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. అవసరమైన మందులను ఉచిత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ అనారోగ్యం వచ్చిన వెంటనే ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వరలక్ష్మి, దుర్గ, లావణ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

21న మండల సమావేశం

దేవరాపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో సువర్ణరాజు శుక్రవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు విధిగా హాజరుకావాలని కోరారు.

మునిసిపాలిటీకి ఓడీఎఫ్ ప్లస్ రావడం అభినందనీయం

స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షన్‌లో నర్సీపట్నం మునిసిపాలిటీకి ఓడీఎఫ్ ప్లస్ రావడం అభినందనీయమని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శుక్రవారం కమిషనర్‌కు ఆయన ఫోన్ చేసి అభినందించారు. అధికారుల సమష్టి కృషి, ప్రజల సహకారంతో ఇది సాధ్యమైందన్నారు. గత ఐదేళ్లలో వెనకబడినప్పటికీ ఇప్పుడు కమిషనర్, సిబ్బంది కృషి ఫలితంగా రాష్ట్ర స్థాయిలో 30వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 553 ర్యాంకు వచ్చినట్టు స్పీకర్ చెప్పారు. మరింత మెరుగ్గా పనిచేసి ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయిలో పదిలోపు ర్యాంకు సాధించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

నేడు ఇరిగేషన్ శాఖ మంత్రి పర్యటన

చోడవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం వీధిలో శనివారం ఉదయం నిర్వహించే సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మలరామానాయుడు, ఎంపీ సీఎం రమేశ్ పాల్గొంటారని పార్టీ నేతలు తెలిపారు. ఉదయం 8 గంటలకే ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సందర్శించనున్నట్టు చెప్పారు. ప్రభుత్వ హైస్కూల్‌లో ఎంపీ విజయేంద్ర ప్రసాద్ నిధులతో నిర్మించిన విద్యార్థుల భోజనశాలను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.మత్స్యరాజు కోరారు.

శాకంబరిదేవిగా దుర్గాంబికదేవి



రావికమతం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోటలో దుర్గాంబిక అమ్మవారు శుక్రవారం శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ బహుళ అష్టమి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేపా రామకృష్ణశర్మ వివిధ రకాల 250 కిలోల పచ్చి కూరకాయలతో అమ్మవారిని అలకరించారు. అలాగే పుష్పలంకరణలు చేసి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు కుటుంబ సమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులతో ప్రజా ధనం లూటీ

మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులతో ప్రజా ధనాన్ని లూటీ చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లికి వందనం పక్కన పెడితే తండ్రికి ఇంధనం అందించేలా బెల్టు షాపులు విచ్చలవిగా పట్టిస్తున్నారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోకి వెళ్లి గత ఐదేళ్ల కాలంలో వైసీపీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ఇచ్చిన పథకాలు గురించి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, వైస్ ఎంపీపీ పొలిమేర విజయలక్ష్మి, సర్పంచ్ యడ్ల కళావతి, నాయకులు కొత్తపల్లి శ్రీనివాసరావు, బొమ్మిశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి: మాజీ ఎమ్మెల్యే గణేశ్

నాతవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబునాయుడు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు హామీలను అమలు చేయలేదన్నారు. ఈ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, పార్టీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, నాయకులు కరక అప్పలరాజు, పైల పోతురాజు, గొర్లి వరహాలబాబు. ఎస్.నరసింగరావు, ఎం.వెంకటరమణ, పోలుపర్తి రాధ, ఇనపసప్పల పుష్ప, శెట్టి లచ్చబాబు, ఎం.సాంబమూర్తి, బండారు నాయుడు పాల్గొన్నారు.

పాఠశాల ఎదురుగా శ్మశానవాటిక వద్దు

గొలుగొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగాపురం గ్రామంలో పాఠశాల ఎదురుగా శ్మశాన వాటిక నిర్మాణం వద్దని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు నాగాపురం గ్రామ సర్పంచ్ ఎలమంచిలి రఘురాం తెలిపారు. గొలుగొండలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గతంలో గ్రామానికి దగ్గరలో ఉన్న ప్రభుత్వ భూమిలో శ్మశానవాటిక నిర్మాణం చేపట్టాలని సూచించామన్నారు. దీనిపై అధికారులు తొందరపాటున పాఠశాల ఎదురుగా శ్మశానం నిర్మాణం చేపట్టడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎల్.పురం ఎంపీటీసీ సభ్యుడు చింతల ప్రసాద్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో అశోక్‌గజపతిరాజు

గవర్నర్‌గా నియమితులైన తరువాత తొలిసారిగా దర్శనం

స్వాగతం పలికిన అధికారులు, పండితులు, ఉద్యోగులు

సింహాచలం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన తరువాత తొలిసారిగా వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన పూసపాటి అశోక్‌గజపతిరాజుకు శుక్రవారం సింహగిరిపై ఘనస్వాగతం లభించింది. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాథరావు ఆధ్వర్యంలో నాదస్వర విద్వాంసుల మంగళకర వాయిద్యాల నడుమ ఆలయ పండితులు, వైదికులు, ఆగమ పాఠశాల విద్యార్థులు అశోక్‌గజపతిరాజు దంపతులను సాదరంగా స్వాగతించారు. ధ్వజస్తంభం వద్ద పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. కప్పస్తంభ ఆలింగనం, గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలిచ్చారు. దేవస్థానం ఈఓ త్రినాథరావు శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. అలాగే అశోక్‌గజపతిరాజును దేవస్థానం ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, సింహగిరి వర్తక సంఘం ప్రతినిధులు, పలువురు అడివివరం గ్రామస్థులు శాలువాలు, పుష్పమాలికలతో అభినందించారు. అందరికీ ఆయన చిరునవ్వుతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజు మీడియాతో మాట్లాడుతూ తన తాత, తండ్రి నుంచి తమ బిడ్డల వరకూ సింహాద్రినాథునికి సేవలు చేయగలగడం స్వామి కటాక్షంగా భావిస్తున్నట్టు చెప్పారు. బాల్యంలో తండ్రి పీవీజీ రాజు తమ తల నీలాలను సమర్పించడం, ఆ తరువాత తమ బిడ్డల తలనీలాలు సమర్పించడం నుంచి నేటివరకూ జరిగిన పరిణామాలను ఆయన గుర్తుచేసుకున్నారు.


కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న అశోక్‌గజపతిరాజు దంపతులు

ఐదు దశాబ్దాల కల సాకారమవుతున్న వేళ..

... 5వ పేజీ తరువాయి

చింతకాయల అయ్యన్నపాత్రుడు కృషి ఎంతో ఉందని వారు చెబుతున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం జరిగిన సంఘటనలను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత తొలిసారి 1983లో జరిగిన ఎన్నికల్లో నర్సీపట్నం నుంచి పోటీ చేసిన అయ్యన్నపాత్రుడు.. ఎన్నికల ప్రచారం నిమిత్తం ఎరకన్నపాలెం వచ్చారు. రాచపల్లి 737 సర్వే నంబరులో వున్న సుమారు 400 ఎకరాలను సాగు చేసుకుంటున్నామని, పంటలు/ ఫలసాయాన్ని అమ్ముకోవడానికి కాలిబాట ద్వారా ఎలమంచిలి వెళ్లి అమ్ముకోవడానికి ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే వాక రోడ్డు నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత అయ్యన్నపాత్రుడు.. ఎరకన్నపాలెం నుంచి మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేయించారు. అయితే అప్పట్లో 737 సర్వే నంబరులో ఉన్న భూమికి సంబంధించి సరిహద్దుల విషయంలో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదాలు వుండేవి. 1999లో అటవీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అయ్యన్నపాత్రుడు.. 737 సర్వే నంబరులో ఉన్న భూమిలో నుంచి ఉన్న కాలిబాటను సర్వే చేయించి, ఎలమంచిలి మండలం పెదపల్లి వరకు వాక రోడ్డును అభివృద్ధి చేయాలని భావించారు. కానీ రెవెన్యూ, అటవీ శాఖల సరిహద్దు వివాదం కారణంగా ఇది కార్యరూపం దాల్చలేదు.

ఇదిలావుండగా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మాకవరపాలెం మండలంలో పరిశ్రమలు ఏర్పాటు చేయించాలని అయ్యన్నపాత్రుడు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే ప్రస్తుతం మాకవరపాలెం నుంచి కశింకోట మండలం తాళ్లపాలెం మీదుగా జాతీయ రహదారికి చేరుకోవాలి. దీనివల్ల ప్రయాణ దూరం, సమయం ఎక్కువ అవుతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా ఎరకన్నపాలెం నుంచి పెదపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపడితే పరిశ్రమలు ఏర్పాటు చేసే వారితోపాటు ఐదు మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలకు రవాణా సదుపాయం మెరుగుపడుతుందని భావించారు. ఈ మేరకు 60 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు.

వైసీపీ రెండు నాలుకల ధోరణి

వాక రోడ్డు విషయంలో వైసీపీ నాయకులు వాస్తవాలను దాచిపెట్టి, రెండు నాలుకల ధోరణితో మాట్లాడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రాచపల్లి 737 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో నుంచి 1956కు ముందే కాలిబాట వున్నట్టు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే 1967లో కూడా దీనిని వాకరోడ్డుగా పేర్కొంటూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు.తరువాత ఈ రోడ్డును ఆనుకొని వున్న రెవెన్యూ భూములను సాగుచేస్తుకుంటున్న రైతులపై అటవీ శాఖ అధికారులు కేసులు పెట్టారు. దీంతో 2022 వైసీపీ అధికారంలో వున్నప్పుడు 737 సర్వే నంబరులో 1,500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని రెవెన్యూ శాఖ తేల్చి చెప్పడంతో అటవీ శాఖ అధికారులు మిన్నకుండిపోయారు. ఈ విషయం తెలిసి కూడా.. వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే గణేశ్.. అటవీ శాఖ భూమిలో నుంచి రోడ్డు వేస్తున్నారంటూ జిల్లా కలెక్టర్‌తోపాటు ఆర్డీవోపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని రైతులు మండిపడుతున్నారు.

తప్పుడు ఎస్సీ ధ్రువపత్రాలను రద్దు చేయాలి

- తహసీల్దార్ల తీరుతో హిందూ దళితులకు అన్యాయం
- హిందూ షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బోని గణేశ్
- జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రకు వినతిపత్రం


జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు రామచంద్రకు వినతిపత్రం అందిస్తున్న బోని గణేశ్, నాయకులు

తుమ్మపాల(అనకాపల్లి), జూలై 18 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ మతాన్ని స్వీకరించిన దళితులకు 'ఎస్సీ హిందువు'గా తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్లు జారీ చేస్తున్నారని, దీనివల్ల నిజమైన షెడ్యూల్డు కులాల హిందువులు రిజర్వేషన్ హక్కులను కోల్పోతున్నారని హిందూ షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బోని గణేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రకు శుక్రవారం సంఘం ప్రతినిధులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రైస్తవ మతంలోకి మారిన దళితులను గుర్తించి వారిని బీసీ-సీ కేటగిరీగా పరిగణించాలని కోరారు. ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని ఉపయోగించుకుంటున్న వారిలో అత్యధికులు దళిత క్రైస్తవులే వున్నారని, దీనివల్ల ఈ చట్టం నీరు గారిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అట్రాసిటీ కేసుల్లో ఫిర్యాదుదారుడి మతం గురించి బహిరంగ విచారణ జరిపిన తరువాతే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆయన కోరారు. క్రైస్తవ మతంలోకి మారిన హైందవ దళితులకు రెవెన్యూ అధికారులు జారీ చేసిన తప్పుడు ఎస్సీ ధ్రువపత్రాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మైలపల్లి పోతురాజు, గో సంరక్షణ జిల్లా అధ్యక్షుడు మర్ర అనిల్‌కుమార్, నాయకులు కారు కుమార్, దిమ్మల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లికి ఎక్స్‌ప్రెస్ బస్సు

- అనకాపల్లి నుంచి ప్రతి శనివారం నిర్వహణ
- వేంకటేశ్వరస్వామిని దర్శించుకునే భక్తుల కోసం ఏర్పాటు
- ఆర్టీసీ డీపీటీవో ప్రవీణ వెల్లడి


డీపీటీవో ప్రవీణ

అనకాపల్లి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం అనకాపల్లి నుంచి ప్రతి శనివారం ఎక్స్‌ప్రెస్ బస్సు నడపనున్నట్టు ఆర్టీసీ డీపీటీవో వి.ప్రవీణ చెప్పారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, నర్సీపట్నం డిపో నుంచి వాడపల్లికి ఇప్పటికే ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడుపుతున్నామని, ఇప్పుడు అనకాపల్లి నుంచి కూడా బస్సు సర్వీసును ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. ఇక్కడి నుంచి ప్రతి శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు బస్సు బయలుదేరుతుందని, వాడపల్లిలో స్వామివారి దర్శనం అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి అనకాపల్లికి బయలుదేరుతుందన్నారు. అనకాపల్లి నుంచి వాడపల్లి వెళ్లడానికి టికెట్ ధర రూ.275 ఉంటుందని ఆమె చెప్పారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

కార్గో ఆదాయం రూ.2 కోట్లు

గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఆర్టీసీకి కార్గో ఆదాయం రూ.2 కోట్ల వరకు వచ్చిందని డీపీటీవో ప్రవీణ తెలిపారు. అధీకృత పార్సిల్ బుకింగ్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అనకాపల్లి డిపో పరిధిలో రూ.1.28 కోట్లు, నర్సీపట్నం డిపో పరిధిలో రూ. 81 లక్షల ఆదాయం లభించిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు అనకాపల్లి డిపో పరిధిలో రూ.35.79 లక్షలు, నర్సీపట్నం డిపో పరిధిలో రూ.26.92 లక్షల ఆదాయం వచ్చిందని చెప్పారు. సమావేశంలో అనకాపల్లి ఏడీఎం గౌరి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై రగడ

... 5వ పేజీ తరువాయి

ఇళ్లలో నెలకు 200 యూనిట్లకు పైబడి విద్యుత్ ఉపయోగించే వారికి కూడా స్మార్ట్ మీటర్లు పెడతామని, ఏర్పాట్లు జరుగుతున్నాయని ఈపీడీసీఎల్ అధికారులు ప్రకటించారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో తొలుత వ్యవసాయ కనెక్షన్లకు గత వైసీపీ ప్రభుత్వంలోనే స్మార్ట్ మీటర్లు పెట్టారు. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీలు, పరిశ్రమలు, వాణిజ్య మీటర్లకు పెడుతున్నారు. గృహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రక్రియ పూర్తిస్థాయిలో మొదలు కాలేదు. వారం క్రితమే ఆ పనులు కూడా చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి.

వ్యతిరేకత ఎందుకంటే?

స్మార్ట్ మీటరు పెడితే మొబైల్ ఫోన్‌ను నెల నెలా ఎలాగైతే ముందుగా రీచార్జి చేసుకుంటామో...ఈ మీటర్‌ను కూడా అలాగే ముందుగా బిల్లు చెల్లించి రీచార్జి చేసుకోవాలి. ప్రస్తుతం విద్యుత్ వాడిన తరువాత బిల్లు ఇస్తున్నారు. దానిని చెల్లించడానికి రెండు వారాల గడువు ఉంటోంది. ఈ మీటరు పెడితే బిల్లు ముందుగానే కట్టాలి. అందుకే చాలామంది వ్యతిరేకిస్తున్నారు.

- ఈ మీటర్లను పెట్టుకుంటే బిల్లు ఎక్కువ వస్తుందని చాలా మంది ఆరోపిస్తున్నారు. వినియోగదారుడి ఇంట్లో మీటరును అధికారులు ఆఫీసులో కూర్చుని మేనేజ్ చేసే అవకాశం ఉందని అనుమానం వ్యక్తంచేస్తున్నారు.
- ఒక్కో విద్యుత్ స్మార్ట్ మీటర్‌ను ప్రభుత్వం సుమారుగా రూ.7 వేలు వెచ్చించి కొనుగోలు చేసింది. ఆ మొత్తాన్ని వినియోగదారుడి నుంచే నెలనెలా బిల్లులో వసూలు చేస్తారని ప్రచారం జరుగుతోంది. అవసరం లేని మీటర్లు పెట్టి డబ్బులు వసూలు చేయడాన్ని కూడా వినియోగదారులు వ్యతిరేకిస్తున్నారు.

200 యూనిట్లు దాటితే...

200 యూనిట్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఈ మీటర్లు పెడతారు. ప్రభుత్వం నుంచి రాయితీ పొందే వారికి, 200 యూనిట్ల కంటే తక్కువ వాడేవారికి వీటిని కావాలన్నా పెట్టరు.

అవన్నీ అపోహలు



శ్యాంబాబు, ఎస్ఈ, విశాఖపట్నం సర్కిల్.

స్మార్ట్ మీటర్లు పెడితే ఎక్కువ బిల్లు వస్తుందనేది అపోహ. అవాస్తవ ప్రచారం మాత్రమే. అలాంటి తప్పులు ఏమైనా జరిగితే సమీక్షించడానికి, చర్యలు చేపట్టడానికి వ్యవస్థలు ఉన్నాయి. అదే విధంగా మీటరుకు డబ్బులు వసూలు చేస్తారనేది కూడా దుష్ప్రచారమే. అది పూర్తిగా ఉచితం. గృహాలకు స్మార్ట్ మీటర్ల ప్రక్రియ ఇప్పుడే ప్రారంభమైంది. పూర్తి కావడానికి సమయం పడుతుంది. మీటరు సరఫరా చేసిన సంస్థ పదేళ్ల పాటు దాని నిర్వహణ బాధ్యతలు చూస్తుంది.

భూ దోపిడీపై సా..గుతున్న విచారణ

... 5వ పేజీ తరువాయి

పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విస్సన్నపేట గ్రామాన్ని సందర్శించిన జనసేన అధినేత.. తాము అధికారంలోకి వచ్చిన తరువాత విస్సన్నపేటలో ప్రభుత్వ భూముల ఆక్రమణ, వైసీపీ నేతల భూ దందాపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ప్రజాప్రతినిధుల వినతి మేరకు విస్సన్నపేట భూ కుంభకోణంపై విజిలెన్స్, సీఐడీ విచారణకు ఆదేశించారు. ఆయా అధికారులు ఇప్పటికే రెండు, మూడుసార్లు విస్సన్నపేట భూములను పరిశీలించారు. గ్రామంలో విచారణ జరిపి, వివరాలు సేకరించారు. ఇది జరిగి నెలలు గడిచినప్పటికీ విచారణ నివేదికను బహిర్గతం చేయలేదు. విస్సన్నపేట భూ ఆక్రమణదారులకు కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదు. విచారణ ఏ దశలో ఉందో అధికారులు సైతం వెల్లడించడం లేదు.

ల్యాండ్ పూలింగ్ మాటున అక్రమాలు

పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడానికి భూ సమీకరణ కోసం వైసీపీ ప్రభుత్వం జీవో 72ను జారీ చేసింది. అప్పట్లో అనకాపల్లి మండలంలో 11 గ్రామాల్లో సుమారు 870 ఎకరాలను రైతుల నుంచి సమీకరించారు. భూములు ఇచ్చిన రైతులకు పరిహారంగా వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ప్లాట్‌లను కేటాయించారు. అయితే జిల్లాకు చెందిన ఒక మంత్రి అండదండలతో, వైసీపీ మండల స్థాయి నాయకులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై, భూములు ఇచ్చిన రైతుల జాబితాలో బినామీల పేర్లను చేర్చారు. ల్యాండ్ పూలింగ్ కింద భూములు ఇవ్వకుండానే వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ప్లాట్‌లను కాజేయాలని ప్రయత్నించారు. కోడూరు గ్రామంలో సర్వే నంబరు 20లో 39 ఎకరాల 38 సెంట్ల ప్రభుత్వ భూమిని అదే గ్రామంలో వైసీపీకి చెందిన తొమ్మిది కుటుంబాలకు చెందిన 34 మంది పేర్లను జాబితాలో చేర్చారు. దీనిపై నాడు ప్రతిపక్షంగా వున్న టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ఆందోళనలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జిల్లా కలెక్టర్‌కు, డీజీపీకి ఫిర్యాదు చేశారు. వైసీపీ అధికారంలో వుండడం, అక్రమాలకు పాల్పడింది ఆ పార్టీ నేతలే కావడంతో విచారణ జరగలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ హయాంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో సాగించిన అక్రమాలపై విజిలెన్స్, సీఐడీ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. సీఐడీ అధికారి నాగేంద్ర భూపాల్ నేతృత్వంలో మూడు బృందాలు అనకాపల్లి, సబ్బవరం, పరవాడ తహసీల్దారు కార్యాలయాల్లో గత ఏడాది డిసెంబరులో తనిఖీలు నిర్వహించారు. అనకాపల్లి మండలం కోడూరు, కూండ్రం, కుంచంగి, మామిడిపాలెం గ్రామాల్లో ల్యాండ్‌పూలింగ్‌కు సంబంధించి పలు కీలక రికార్డులను స్వాధీనం చేసుకొని వెంట తీసుకెళ్లారు. దీంతో అక్రమార్కులపై త్వరలోనే చర్యలు ఉంటాయని అంతా భావించారు. ఇది జరిగి దాదాపు ఏడు నెలలు దాటింది. ల్యాండ్ పూలింగ్ అక్రమాలపై చేపట్టిన విచారణ ఏమైందో స్థానిక అధికారులకే తెలియని పరిస్థితి నెలకొంది. ఏయే రికార్డులు తీసుకెళ్లారో కూడా రెవెన్యూ అధికారుల వద్ద సమాచారం లేదు. మరోవైపు ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇవ్వకపోయినా.. జాబితాల్లో పేర్లు చేర్చిన బినామీ రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లకు బదులు నగదు రూపంలో నష్టపరిహారం అందజేయడానికి పావులు కదిపారు. ఈ వ్యవహారంలో కూటమికి చెందిన ఒక పార్టీ నేతలు తెరవెనుక కథ నడిపించి, రెవెన్యూ అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చినట్టు ఆరోపణలు వచ్చాయి. కోడూరు గ్రామంలో 20వ సర్వే నంబరులో వున్న 39.38 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి గతంలో బినామీ రైతులుగా పేర్లు నమోదు చేసిన వ్యక్తులకు ఇటీవల సుమారు రూ.6 కోట్లు పరిహారంగా చెల్లించేశారు. వైసీపీ హయాంలో బినామీ రైతుల వ్యవహారంపై అధికారులకు ఫిర్యాదులు చేయడమే కాకుండా ఆందోళనలు చేసిన టీడీపీ నాయకులు.. ఇప్పుడు నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ప్రభుత్వం, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ఇప్పటికైనా విచారణ నివేదికలను బహిర్గతం చేసి, భూదోపిడీదారులపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అచ్యుతాపురంలో ట్రాఫిక్ జామ్

... 5వ పేజీ తరువాయి

మళ్లించారు. మరోవైపు గాజువాక, ఎలమంచిలి, అనకాపల్లి వైపు నుంచి అచ్యుతాపురం మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు వీటికి తోడు కావడంతో అచ్యుతాపురం జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పైగా అచ్యుతాపురం, మోసయ్యపేటలో శుక్రవారం జరిగిన సంతల కారణంగా కొనుగోలు దారులు, వ్యాపారుల వాహనాలతో రద్దీ మరింత పెరిగింది. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గాజువాక, ఎలమంచిలి, అచ్యుతాపురం రోడ్లలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వేడి, ఉక్కపోతతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పోలీసులు రంగంలోకి దిగి సుమారు రెండు గంటలపాటు శ్రమించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

రెవెన్యూకు త్వరలో సొంత గూడు

... 5వ పేజీ తరువాయి

తరలించారు. అయితే భవన నిర్మాణానికి మంజూరైన నిధులు చాలకపోవడంతో అసంపూర్తిగా ఆగిపోయింది. ఇదే సమయంలో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. రెవెన్యూ కార్యాలయం భవన నిర్మాణం పూర్తిచేయించడానికి ఐదేళ్ల కాలంలో ఎటువంటి చర్యలు చేపట్టలేదు. గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్‌లను చోడవరం పర్యటనకు తీసుకువచ్చి, తహసీల్దారు కార్యాలయానికి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రభుత్వం ఇటీవల ఒక కోటి 20 లక్షల రూపాయలు మంజూరు చేసింది. అధికారులు టెండర్లు పిలిచి భవన నిర్మాణ పనులను పునఃప్రారంభించారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే తహసీల్దారు కార్యాలయంతోపాటు సబ్‌ట్రెజరీ, వెలుగు కార్యాలయాలకు వసతి సమస్య తీరుతుంది.

క్రైం... crime news

మురుగుకాలువలో పసికందు మృతదేహం

- అధికారుల విచారణ



పసికందు మృతదేహాన్ని పరిశీలిస్తున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, సీఐ అప్పలరాజు, తదితరులు (ఇన్‌సెట్‌లో) మురుగునీటి కాలువలో పడి ఉన్న పసికందు మృతదేహం

చోడవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంభేరుపురం గ్రామ సమీపంలోని మురుగునీటి కాలువలో పసికందు మృతదేహం ఉండడం కలకలం రేపింది. బీఎన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న మురుగునీటి కాలువలో ఎవరో పసికందు మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం స్థానికులు ఇది గమనించి పోలీసులకు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలాన్ని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, సీఐ అప్పలరాజు సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఐసీడీఎస్, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పసికందు మృతదేహాన్ని పరిశీలించారు.

పసికందు మృతదేహానికి డీఎన్ఏ పరీక్షలు

మురుగునీటి కాలువలో పడేసిన పసికందు మృతదేహాన్ని వైద్యపరీక్షల నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు సీఐ అప్పలరాజు తెలిపారు. పసికందు మృతదేహానికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

సమాచారం తెలిపితే పారితోషికం

పసికందు మృతదేహాన్ని పడేసిన వారి వివరాలు తెలిసిన వారు తమకు సమాచారం అందిస్తే తగిన పారితోషికం అందిస్తామని సీఐ అప్పలరాజు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9440796090, 949295255, 08934-245033 నంబర్లకు తెలపాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


మృతి చెందిన బొద్దపు రాజుబాబు

మాడుగుల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒమ్మలి గ్రామంలో విద్యుదాఘాతంతో బొద్దపు రాజుబాబు (50) శుక్రవారం మృతి చెందాడని ఎస్ఐ జి. నారాయణరావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒమ్మలి గ్రామానికి చెందిన బొద్దపు రాజుబాబు (50), భార్య లక్ష్మి, కుమార్తెతో శుక్రవారం ఉదయం అవురివాడ గ్రామంలో ఉన్న తన పామాయిల్ తోటలో పని చేసుకునేందుకు వెళ్లారు. తోటలోని పామాయిల్ చెట్ల గెలలను పొడవటి ఐరన్ రాడ్‌కి కట్టిన కత్తితో కోస్తున్నాడు. ఒక చెట్టు గెలలు కోస్తుండగా పైన ఉన్న విద్యుత్ వైర్లకు కత్తి తగలడంతో రాజుబాబు విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయన్ని కింతలి పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందడంతో ఎస్ఐ నారాయణరావు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. అనంతరం రాజుబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

రెండు కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

అనకాపల్లి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పూల్‌బాగ్ రోడ్డులోని తాగునీటి రిజర్వాయర్ వద్ద గురువారం రాత్రి గంజాయి అమ్ముతున్నట్టు సమాచారం అందడంతో ఎస్ఐ కె.సంతోశ్‌కుమార్, పోలీసు సిబ్బంది కలిసి అక్కడకు వెళ్లారని చెప్పారు. ఇద్దరు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వెంటపడి పట్టుకున్నారని, వీరి వద్ద వున్న బ్యాగును తనిఖీ చేయగా చిన్నపాటి ప్యాకెట్లలో సుమారు రెండు కిలోల గంజాయి లభించిందన్నారు. డీబీ కాలనీకి చెందిన మాదాసు వందన్ సాయి ఫణిశ్రీ, గవరపాలెం రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మంగళగిరి దుర్గా వరప్రసాద్‌లుగా గుర్తించి అరెస్టు చేసినట్టు చెప్పారు. పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నక్కపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదుళ్లపాలెం వద్ద గత వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్టు ఎస్ఐ సన్నిబాబు చెప్పారు. న్యాయంపూడి గ్రామానికి చెందిన చెవ్వేటి నాగేశ్వరరావు ఈ నెల 13న రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

రెవెన్యూ భూమిలోనే వాక రోడ్డు

... 5వ పేజీ తరువాయి

రోడ్డు నిర్మాణం ఎలా చేపడతారో కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాక రోడ్డు నిర్మాణంపై జిల్లా కలెక్టర్‌పై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతల తీరుపై తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు స్పందించారు. జాయింట్ సర్వే చేసేందుకు సర్వే నంబరు 737లో వున్న భూముల్లోకి వెళ్లారు. అయితే అప్పటికే అక్కడ వున్న పలువురు రైతులు, టీడీపీ నాయకులు వారిని నిలువరించారు. రెవెన్యూ భూమిలో నుంచి వాక రోడ్డు నిర్మాణం కోసం తుప్పలు తొలగించిన తమపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, వాక రోడ్డు నిర్మాణం విషయంలో కలెక్టర్, ఆర్డీవోలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే గణేశ్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన తరువాతే సర్వే నిర్వహించాలని పట్టుబట్టారు. దీంతో జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఎస్.గోపాలరాజు మాట్లాడుతూ, రెవెన్యూ భూమిలోనే వాక రోడ్డు నిర్మాణం చేస్తున్నట్టు స్పష్టం చేశారు. రైతులు తుప్పలు తొలిగించిన స్థలం మొత్తం రెవెన్యూ భూమిగా రికార్డుల్లో ఉందన్నారు. దీంతో రైతులు శాంతించి సర్వేకు సహకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వాకరోడ్డు పూర్వం కాలిబాటగా వుండేదని, ఈ మేరకు అటవీ, రెవెన్యూ శాఖల రికార్డుల్లో నమోదై ఉందన్నారు. అనంతరం ఇరు శాఖల అధికారులు కొండపైకి వెళ్లి సరిహద్దుల రాళ్లను గుర్తించారు. వాక రోడ్డు నిర్మాణం పూర్తిగా రెవెన్యూ భూమిలోనే చేపడుతున్నట్టు ఆర్డీవో వీవీరమణ, అటవీ శాఖ రేంజర్ పి.రాజేశ్వరావుకు విశదపరిచారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం, మాకవరపాలెం తహసీల్దార్లు రామారావు, వెంకటరమణ, టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, నందకిశోర్, ఆర్‌వై పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

21 మంది ఉపాధ్యాయులకు నోటీసులు

... 5వ పేజీ తరువాయి

ఇటీవల పదవీ విరమణచేసిన ఉపాధ్యాయుడికి నోటీసులు జారీ చేయడం విశేషం. గొలుగొండ మండలం నాగాపురం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు జి.సత్యనారాయణ ఈ ఏడాది ఏప్రిల్ 30న రిటైర్ అయ్యారు. అయినప్పటికీ జిల్లా విద్యా శాఖాధికారులు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశగా మారింది. ఈ విషయంపై సంబంధిత అధికారిని వివరణ కోరగా.. రిటైర్ అయిన ఉపాధ్యాయుడు జి.సత్యనారాయణ వివరాలను ఆన్‌లైన్‌లో తొలగించకపోవడం వల్ల ఈ సమస్య వచ్చిందని చెప్పారు. ఆయనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకుంటున్నట్టు డీఈఓ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	76.00
లైవ్ ధర	96.00
విత్ స్కిన్	162.00
స్కిన్ లెస్	172.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544